

ధనలక్ష్మిగా కనకమ్మ

వన్‌టౌన్, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పాతనగరం బురుజుపేటలో కొలువైన కనక మహాలక్ష్మి అమ్మవారు శుక్రవారం ధనలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి లక్ష చామంతులను నివేదించారు. నగరానికి చెందిన ఆర్.సతీష్, ఆర్.రాధిక ఉభయదాతలుగా వ్యవహరిస్తూ అలంకరణకు అవసరమైన చామంతుల కొనుగోలుకు రూ.55వేలు అందజేశారు. అమ్మవారి అలంకరణకు ఉపయోగించిన పట్టు చీరలను లక్కీ, సౌత్ ఇండియా షాపింగ్ మాల్స్ సమకూర్చాయి. పూజల్లో ఆలయ ఈఓ శోభారాణి, ఏఈఓ తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకులు తిరుపతిరావు, కె.పద్మజ పాల్గొన్నారు.

పర్యాటక దస్త్రాలు తనిఖీ

న్యూస్‌టుడే, ఎంవీపీ కాలనీ, పెదవాల్తేరు: జిల్లాలో ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) లీజులు, వివిధ ప్రాజెక్టుల నిర్వహణలో లోపాలపై విచారణ జరిపేందుకు వచ్చిన కొత్త కమిటీ శుక్రవారం పలు ప్రాజెక్టులను పరిశీలించింది. ఉదయం అప్పూఘర్‌లోని ఏపీటీడీసీకి చెందిన హరితా హోటల్‌ను సందర్శించి రికార్డులు తనిఖీ చేసింది. ప్రస్తుతం హరితా హోటల్ పునరుద్ధరణ పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఏ మేరకు బిల్లులు జరిగాయి, పనులు ఏవిధంగా చేశారు, వాటి



హరితా హోటల్‌లో వివరాలు తెలుసుకుంటున్న కమిటీ సభ్యులు

అంచనాలకు సంబంధించిన రికార్డులు పరిశీలించినట్లు తెలిసింది. అక్కడి నుంచి రుషికొండలోని బ్లూఫ్లాగ్ బీచ్‌ను మరోసారి తనిఖీ చేశారు. అక్కడే ఉన్న మరికొన్ని రిసార్టుల దస్త్రాలు పరిశీలించారు. తరువాత వీఎంఆర్‌డీఏలోని ప్రాంతీయ సంచాలకుడి కార్యాలయంలోని దస్త్రాలు, పర్యాటక సమాచార అధికారి కార్యాలయం నుంచి దస్త్రాలు తీసుకొని పరిశీలించారు.

గట్టిగా అరుస్తూ.. బలంగా కరుస్తూ..

నగరంలో కుక్కల స్వైర విహారం
భయపడుతున్న విశాఖ వాసులు

నగరంలో వీధి కుక్కల సంఖ్య: 1.70లక్షలు (సుమారు)

శునకాల నియంత్రణకు ఏటా ఖర్చు: రూ.2కోట్లు

ఏటా చేస్తున్న కు.ని.శస్త్రచికిత్సలు: 10వేలు





ఈనాడు-విశాఖపట్నం, కార్పొరేషన్-న్యూస్‌టుడే

వీధి కుక్కల స్వైర విహారంతో నగరవాసులు బెంబేలెత్తిపోతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో రోడ్లపై వెళ్లేవారిపై దాడి చేసి కరుస్తున్నాయి. ద్విచక్రవాహన చోదకులను వెంబడిస్తున్నాయి. దీంతో వీధుల్లోకి రావాలంటేనే స్థానికులు భయపడుతున్నారు. కుక్కలు దాడి చేసిన ఘటనలు వెలుగులోకి వస్తే తప్ప అధికారుల్లో స్పందన కనిపించడం లేదు.

గతంలో...ఘటనలు ఎన్నో...

- ఇంట్లో పెంచుకుంటున్న కుక్క కరిచిన తరువాత సరైన రీతిలో వైద్యం తీసుకోకపోవడంతో ఓ వ్యక్తి మృత్యువాత పడ్డ విషాదం నగరంలో కొన్ని నెలల కిందట చోటుచేసుకుంది.
- టీఎస్సార్ బంగ్లా సమీపంలో ఓ చిన్నారిపై వీధి కుక్కలు దాడి చేసి, పేగులు బయటకు వచ్చేలా కరిచాయి. ఆసుపత్రికి తరలిస్తుండగా బాలుడు మృతి చెందాడు.
- వెంకోజీపాలెం సమీపంలో ఉయ్యాలలో ఉన్న దివ్యాంగ బాలికపై కుక్కలు కర్కశంగా దాడి చేశాయి. కదల్లేని పరిస్థితిలో ఉన్న బాలిక అక్కడే మృతి చెందింది.
- జోన్-8 పరిధిలో ఓ వృద్ధురాలిపై కుక్కలు దాడి చేయగా.. ఆమె చికిత్స పొందుతూ మరణించింది.

నిధులు ఖర్చైపోతున్నా: ఏటా కుక్కల నియంత్రణకు జీవీఎంసీ రూ.కోట్లు ఖర్చు చేస్తున్నా ఆశించిన ఫలితాలు రావడం లేదు. కు.ని శస్త్ర చికిత్స చేయని కుక్కలను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలు, ఐదు వాహనాలు నగరంలో నిత్యం సంచరిస్తుంటాయి. నరవ, ఆరిలోవ ప్రాంతాల్లో జీవీఎంసీకి కుక్కల శస్త్ర చికిత్సల కేంద్రాలున్నాయి. పదేళ్లుగా శస్త్ర చికిత్సలు చేస్తున్నా, కనీసం వాటి సంఖ్య తగ్గకపోగా భారీగా పెరుగుతుండటం గమనార్హం. గతంలో ఒకేసారి 20వేల కుక్కలకు శస్త్ర చికిత్స చేయించడానికి అప్పటి కమిషనర్ ప్రవీణ్‌కుమార్ ఏర్పాట్లు చేసి, వైద్యులను కూడా తీసుకువచ్చారు. శిబిరం ప్రారంభమైన మూడో రోజు కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో చికిత్సలను అక్కడితో ఆపేశారు.

టీకాలపై అవగాహన లేక: కుక్కల పెంపకందారులకు రేబిస్ వైరస్, ఇతరత్రా వ్యాక్సినేషన్(టీకాలు) ఎప్పటికప్పుడు వేయించాలన్న అవగాహన కల్పించడంలో అధికారులూ విఫలమయ్యారు. నగరంలో 95 శాతం పెంపుడు కుక్కలకు లైసెన్సులు లేవని సమాచారం. రేబిస్ వైరస్ వ్యాప్తి ఎలా జరుగుతుంది? కుక్కలు పెంచడం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన లేక ఒక్కో ఇంట్లో రెండు, మూడు పెంచుతున్నారు. దీంతో పెంపుడు కుక్కల సంఖ్య నగరంలో పెరిగిపోయింది.

మధురవాడకు మరో సబ్‌రిజిస్ట్రార్!

ఈనాడు, విశాఖపట్నం: మధురవాడ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి కె.రోహన్‌కుమార్ అనే మరో సబ్‌రిజిస్ట్రార్‌ను నియమిస్తూ స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖ ఉత్తర్వులు ఇచ్చింది. ఖజానాకు ఎక్కువ ఆదాయం వచ్చే కార్యాలయాల్లో ప్రజలకు వేగవంతమైన సేవలందించేందుకు అదనపు అధికారులను నియమించాలని ప్రభుత్వం ఆలోచన చేసింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని కొన్ని కార్యాలయాలకు తాత్కాలిక జాయింట్ సబ్‌రిజిస్ట్రార్ పోస్టులను ఏర్పాటు చేసింది. శుక్రవారం రోహన్ బాధ్యతలు తీసుకున్నారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఆయన్ని పెదగంట్యాడ సబ్‌రిజిస్ట్రార్‌గా నియమించారు. పరిపాలన సౌలభ్యం నిమిత్తం మధురవాడకు డిప్యుటేషన్‌పై నియమించారు. ఇక్కడ జాయింట్-1 సబ్‌రిజిస్ట్రార్‌గా చక్రపాణి విధులు నిర్వహిస్తున్నారు.

భీమిలికి అమలు చేస్తారా?: గత ప్రభుత్వంలో ఎక్కువ ఆదాయం వచ్చే చోట తాత్కాలిక అవసరాలకు అదనపు సబ్‌రిజిస్ట్రార్లను నియమించి ఆ తర్వాత తొలగించేశారు. ప్రస్తుతం జిల్లాలో విశాఖ ఆర్‌వోలో ఇద్దరుండగా తాజాగా మధురవాడకు కూడా అలాగే కేటాయించారు. గతంలో భీమిలి కార్యాలయంలో ఇద్దరేసి చొప్పున సేవలందించినా తరువాత ఆపేశారు. ఇక్కడ కూడా మరో అధికారిని నియమిస్తారన్న ప్రచారం జరుగుతుంది.

తాత్కాలికంగా లడ్డూ విక్రయాల నిలిపివేత

ఎండాడ, న్యూస్‌టుడే: ఎండాడ కొండపై గల శ్రీమహాలక్ష్మీ గోదాదేవి సహిత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ శనివారం నుంచి వచ్చే శనివారం వరకు శ్రీవారి లడ్డూ ప్రసాద విక్రయాలు నిలిపివేస్తున్నట్లు ఆలయ ఏఈవో జగన్మోహనచార్యులు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తిరుపతిలో బ్రహ్మోత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారని, ఆ ఉత్సవాలు ముగిశాక వీటి విక్రయం యథావిధిగా కొనసాగుతుందని తెలిపారు.

వైద్య విద్యాశాఖలో పదోన్నతుల చిచ్చు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: వైద్య విద్యాశాఖ (డీఎంఈ) పరిధిలో పదోన్నతులపై చిచ్చు రగులుతోంది. వైకాపా ప్రభుత్వ హయాంలో ఇచ్చిన జీఓను అడ్డం పెట్టుకొని కొంత మంది జూనియర్ ప్రొఫెసర్లకు ఏడీఎంఈలుగా పదోన్నతి కల్పించేందుకు రంగం సిద్ధమవుతుండడంతో సీనియర్ వైద్యులు ఆందోళన చెందుతున్నారు. వైద్య విద్యాశాఖ సంచాలకులు (డీఎంఈ) విడుదల చేసిన సీనియార్టీ జాబితాను పక్కన బెట్టి రాష్ట్రవ్యాప్తంగా 8 మంది జూనియర్ ప్రొఫెసర్లకు ఏడీఎంఈలుగా పదోన్నతి కల్పించి కేజీహెచ్ సహా రాష్ట్రంలోని వివిధ బోధనాస్పత్రులకు పర్యవేక్షకులు (సూపరింటెండెంట్), ప్రిన్సిపాళ్లుగా నియమించేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయని, ఇది తమ సీనియార్టీని తీవ్రంగా దెబ్బతీయనున్నదని పలువురు ఆందోళన చెందుతున్నారు. ఇదే విషయాన్ని ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం (ఏపీజీడీఏ) ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఐదేళ్లు ప్రొఫెసర్‌గా పనిచేసిన అనుభవం ఉంటే బోధనాస్పత్రులకు పర్యవేక్షకులు/ప్రిన్సిపాళ్లుగా నియమించేందుకు అవకాశం కల్పిస్తూ వైకాపా పాలనలో జీఓ విడుదల అయింది. ఎఫ్ఏసీ (పూర్తి అదనపు బాధ్యతలు) వరకు మాత్రమే పరిమితం చేయాల్సిన జీఓను శాశ్వత ప్రాతిపదికన నియామకాలు చేపట్టేందుకు వినియోగించడం సరికాదని సీనియర్ వైద్యులు మండిపడుతున్నారు.

✦ ఇటీవల డీఎంఈ కార్యాలయం 153 మంది ప్రొఫెసర్లతో కూడిన సీనియార్టీ జాబితాను వెలువరించింది. ఈ జాబితాలో ఉన్న వారికి ఎప్పుడెప్పుడు వైద్య విద్యాశాఖ అదనపు సంచాలకులు (ఏడీఎంఈ)లుగా పదోన్నతులు వచ్చేది అందులో నిర్దేశించారు. ప్రస్తుతం కేజీహెచ్‌కు పూర్తి స్థాయి పర్యవేక్షక వైద్యాధికారి లేరు. ఎముకల విభాగ ప్రొఫెసరు డాక్టర్ వి.శివానంద ఇన్‌ఛార్జిగా కొనసాగుతున్నారు. ఇక్కడ ఏడీఎంఈ హోదాలో పనిచేసిన డాక్టర్ అశోక్‌కుమార్ అనారోగ్య కారణాల రీత్యా సెలవులో వెళ్లడంతో డాక్టర్ శివానందను ఇన్‌ఛార్జిగా ప్రభుత్వం నియమించింది. డీఎంఈ ప్రకటించిన సీనియార్టీ జాబితాలో శివానంద కన్నా పలువురు సీనియర్ వైద్యులు ముందు వరుసలో ఉన్నారు.

✦ ఈ శాఖలో ప్రస్తుత పరిణామాల వల్ల తమకు తీరని అన్యాయం జరుగుతోందని పలువురు ప్రొఫెసర్లు వాపోతున్నారు. ఇదే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఏపీజీడీఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ డి.జయధీర్ తెలిపారు. త్వరలో ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులను కలిసి సీనియార్టీ ప్రకారం ప్రిన్సిపల్, పర్యవేక్షక వైద్యాధికారుల పోస్టులను భర్తీ చేయాలని కోరనున్నట్లు వివరించారు.

అంతటా కొరత.. నిత్యం కలత

★ ఉక్కులో తగ్గిపోతున్న మానవ వనరులు
★ ఖనిజాలు.. నిధుల లభ్యతదీ ఇదే పరిస్థితి

న్యూస్‌టుడే, ఉక్కునగరం (స్టీల్‌సెక్టార్-3)

విశాఖ ఉక్కు కర్మాగారాన్ని పూర్తి స్థాయిలో నడుపుతామంటూ ఇటీవల కేంద్ర ఉక్కుశాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి, సహాయ మంత్రి శ్రీనివాసవర్మ ప్రకటనలు చేశారు. 7.3 మిలియన్ టన్నుల సామర్థ్యం గల కర్మాగారాన్ని పూర్తిస్థాయిలో నడపాలంటే ఎంతమంది ఈడీలు, సీజీఎంలు, సిబ్బంది ఉండాలి..? ప్రస్తుతం ఎంతమంది ఉన్నారనేది కనీస పరిశీలన చేయకుండానే ప్రకటనలు చేసేశారని కార్మిక నాయకులు ఆరోపిస్తున్నారు.

ఉక్కులో ఉద్యోగులు (సుమారు)



మానవ వనరుల కొరత ఉన్నా.. సంస్థలో నిరంతరం ఉత్పత్తి సాధించేందుకు కార్మికులు తీవ్రంగా కృషి చేస్తున్నారు. అయితే కేంద్రం ఉక్కుశాఖ మాత్రం తాజాగా 4 వేల మంది ఒప్పంద కార్మికుల్ని తొలగించేందుకు ఇటీవల చేసిన కొన్ని ప్రయత్నాలు కలకలం రేపాయి. చివరికి ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి జోక్యం చేసుకొని పరిస్థితి చక్కదిద్దినా... ఉద్యోగుల్లో ఆందోళన మాత్రం వీడలేదు.

ఆటంకాలెన్నో : ఓవైపు ముడిసరకు కొరత, ఇంకో వైపు ఉత్పత్తికి అవసరమైన నిధులు కరవు.. మరోవైపు ఉద్యోగ విరమణలు, అవసరమైన మేరకు సిబ్బందిని భర్తీ చేయకపోవడం... ఇలాంటి కారణాలతో క్షేత్రస్థాయిలో అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సకాలంలో సరైన నిర్ణయాలు, ప్రణాళికలు అమలు చేసే పరిస్థితి లేకపోవడంతో కర్మాగారం అభివృద్ధికి ఆటంకాలు ఎదురవుతున్నాయి.

- రూ.లక్షల కోట్ల విలువైన కర్మాగారాన్ని నడిపే ప్రధాన అధికారి అయిన సీఎండీ పోస్టు... ప్రస్తుతం ఇన్‌ఛార్జితో నడుస్తుంది. 14 మంది ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు(ఈడీలు) ఉండాల్సి ఉన్నా... ఒక్కరూ లేరు. 72 మంది సీజీఎంలకు కేవలం ఆరుగురే ఉన్నారు. జీఎంలూ 20 నుంచి 30 మంది తక్కువగానే ఉన్నారు.



- మిగిలిన కిందిస్థాయి యువ అధికారుల్లో చాలామంది గత నాలుగేళ్ల నుంచి విశాఖ ఉక్కును వీడి బయటకు వెళ్లిపోయారని హెచ్‌ఆర్ విభాగం అధికారులు చెబుతున్నారు. టెక్నిషియన్లు, ఛార్జ్‌మెన్లు, జేఓలు సంఖ్య తక్కువగానే ఉంది.
- ఇలాంటి పరిస్థితుల్లో ఇంకా సిబ్బందిని తగ్గించాలని కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు... కర్మాగారాన్ని ఎటువైపు తీసుకెళ్తాయోనని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కేంద్రం తన వైఖరిని మార్చుకుని కర్మాగారాన్ని సెయిల్‌లో విలీనం చేస్తేనే విశాఖ ఉక్కు మనుగడ సాధ్యమవుతుందని కార్మికులు చెబుతున్నారు.

నేడు, రేపు మంత్రి దుర్గేశ్ పర్యటన

వన్‌టౌన్, న్యూస్‌టుడే: పర్యాటక శాఖ మంత్రి దుర్గేశ్ ఈనెల 5, 6 తేదీల్లో జిల్లాలో పర్యటించనున్నారు. శనివారం ఉదయం 10.30 గంటలకు విశాఖ చేరుకొని హోటల్లో బస చేయనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు గోల్ఫ్‌క్లబ్‌లో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. 6న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పర్యాటక శాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయనున్నారు. 7న ఉదయం విశాఖ నుంచి బయలుదేరి రాజమహేంద్రవరం వెళ్లనున్నారు.

బ్లూఫ్లాగ్.. రెపరెపలు



రుషికొండ బీచ్‌లో 'బ్లూఫ్లాగ్' రెపరెపలాడుతోంది. నిర్ణీత ప్రమాణాల ప్రకారం వసతులు, సౌకర్యాలు, శుభ్రత ఉన్న బీచ్‌లకు ఈ 'బ్లూఫ్లాగ్' గుర్తింపు వస్తుంది. ఇటీవల తనిఖీల తరువాత రుషికొండ బీచ్‌కు మరోసారి ఇది దక్కింది. -ఈనాడు, విశాఖపట్నం

ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.5 లక్షల విరాళం



ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావుకు చెక్కును అందిస్తున్న గాయత్రీ విద్యా పరిషత్ ప్రతినిధులు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి సహాయ నిధికి గాయత్రీ విద్యా పరిషత్ (జీవీపీ) రూ.5 లక్షలు విరాళంగా అందించింది. వరద బాధితులకు సహాయంగా సంబంధిత చెక్కును ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్. ధనుంజయరావుకు శుక్రవారం కళాశాల ప్రతినిధులు అందించారు. కార్యక్రమంలో సీడీసీ డీన్ ఆచార్య టీవీ కృష్ణ, అసోసియేట్ డీన్ ఆచార్య నాగమానసూమన్ పాల్గొన్నారు.

బజాజ్ ఫ్రీడం 125 సీసీ సీఎన్‌జీ బైక్ ఆవిష్కరణ



ద్విచక్రవాహనాన్ని ప్రారంభిస్తున్న వరుణ్ గ్రూప్ ఛైర్మన్ ప్రభుకిశోర్

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: బజాజ్ ఆటో ప్రవేశపెట్టిన బజాజ్ ఫ్రీడం 125 సీసీ సీఎన్‌జీ బైకును సిరిపురం బజాజ్ షోరూంలో వరుణ్ గ్రూప్ ఛైర్మన్ ప్రభుకిశోర్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బజాజ్ ఫ్రీడమ్ బైక్ ట్విన్ ట్యాంక్ సెటప్‌ను కలిగి ఉంటుందన్నారు. ఒక ట్యాంక్ పెట్రోలు కోసం, మరొకటి సి.ఎన్.జి కోసం ప్రత్యేకంగా డిజైన్ చేసినట్లు చెప్పారు. డ్రమ్, డ్రమ్ ఎల్.ఇ.డి, డిస్క్ ఎల్.ఇ.డి మూడు రకాల వేరియంట్లలో లభ్యమవుతుందని తెలిపారు. వరుణ్ గ్రూప్ ఎండీ వరుణ్‌దేవ్, రీజనల్ మేనేజర్ సచిన్ జైన్, ఏరియా సర్వీస్ మేనేజర్ ఎన్.భువనేష్, సేల్స్ మేనేజర్ అబాస్ శేఖరన్, సీఈవో శ్రీనివాస్, వరుణ్ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య విద్యలో పతకాల పంట

'డాక్టర్ హిమాని'కి బెస్ట్ అవుట్ గోయింగ్ అవార్డుతో సహా 12 పతకాలు



పతకాలతో డాక్టర్ హిమాని

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఆంధ్ర వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ చదివిన డాక్టర్ ఎన్.హిమాని బెస్ట్ అవుట్ గోయింగ్ స్టూడెంట్ అవార్డుతో సహా వివిధ విభాగాల నుంచి 12 వరకు పతకాలు సొంతం చేసుకుని ఉత్తమ విద్యార్థినిగా నిలిచారు. 250 మంది చదువుతున్న ఏఎంసీలో ఇన్ని అవార్డులు ఒకే విద్యార్థినికి దక్కడం అరుదైన అంశమేనని ప్రిన్సిపల్ డాక్టర్ జి.బుచ్చిరాజు పేర్కొన్నారు. 2019 బ్యాచ్‌కు చెందిన హిమాని ఇటీవలే ఎంబీబీఎస్ కోర్సు పూర్తి చేసి... ప్రస్తుతం హౌస్ సర్జన్‌గా సేవలందిస్తున్నారు. కళాశాల దినోత్సవంలో ప్రిన్సిపల్ డాక్టర్ బుచ్చిరాజు హిమానికి అవార్డులను అందజేసి అభినందనలు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా పలాస-కాశీబుగ్గకు చెందిన వైద్య దంపతులు డాక్టర్ ఎన్.నటరాజు, డాక్టర్ ఎం.మంజుల దంపతుల కుమార్తె హిమాని ప్రాథమిక విద్యాభ్యాసం నుంచి చదువులో రాణించింది. నీట్‌లో జాతీయ స్థాయిలో 91వ ర్యాంకు సాధించి ఏఎంసీలో ఎంబీబీఎస్ కోర్సులో చేరారు. యూజీ కోర్సులో సైతం అగ్రస్థానంలో కొనసాగి బెస్ట్ అవుట్ గోయింగ్ విద్యార్థినిగా నిలిచి సత్తాచాటారు.



బెస్ట్ అవుట్ గోయింగ్ అవార్డును ఏఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ జి.బుచ్చిరాజు నుంచి అందుకుంటున్న డాక్టర్ హిమాని

అవార్డుల వివరాలు ఇవీ: మైక్రోబయాలజీ, పెథాలజీ, ఫార్మకాలజీ, అప్తమాలజీ, ఎస్‌పీఎం, క్లినికల్ సర్జరీ, పీడియాట్రిక్స్, క్లినికల్ న్యూరాలజీ విభాగాలకు సంబంధించి డాక్టర్ రాజారావు, డాక్టర్ కోటేశ్వరరావు, డాక్టర్ భాస్కర్ మీనన్, డాక్టర్ కోటనాగేంద్ర ఆచారి, మాధవరావు, డాక్టర్ వల్లభరావు, జైపూర్ విక్రమ్‌దేవ్‌వర్మ, డాక్టర్ భోగరాజు రామ్మూర్తి, సజ్జ చంద్రమౌళి పేర్లతో ఉన్న అవార్డులు ఈమెకు దక్కాయి. సిల్వర్‌జూబ్లీ సెలబ్రేషన్ కమిటీ, ఆంధ్రజన్ మెడల్ లభించాయి. ఆయా విభాగాల్లో జరిగిన పోటీ పరీక్షల్లో పాల్గొని అవార్డులు కైవసం చేసుకుంది. వీటితో పాటు డాక్టర్ కల్యాణబాబు, డాక్టర్ తిరుమలరావు, డాక్టర్ పీవీఎస్ఎస్ఆర్ఎల్, డాక్టర్ కల్యాణమ్మ సీతమ్మ, డాక్టర్ రాజకిశోర్ భాటియా స్మారక అవార్డులు లభించాయి.

తల్లిదండ్రులే స్ఫూర్తి..

మా నాన్న డాక్టర్ నటరాజు మంచి వైద్య నిపుణుడిగా, తల్లి డాక్టర్ మంజుల ప్రసూతి వైద్య నిపుణురాలిగా సేవలందిస్తున్నారు. వారే నాకు స్ఫూర్తి. మా నాన్న పర్యవేక్షణలో ప్రతిభకు మెరుగులు దిద్దుకున్నా. అందువల్లే ఇన్ని అవార్డులు లభించాయి. జనరల్ మెడిసిన్ చదివి ఏదైనా సూపర్‌స్పెషాలిటీ విభాగ వైద్యురాలిగా స్థిరపడాలని ఉంది. – డాక్టర్ హిమాని

అవివాహితులకు సువర్ణావకాశం

నేడు, రేపు కాపు/ తెలగ అవివాహిత వధూవరులకు 'ఈనాడు పెళ్లిపందిరి' ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం

తెలుగింటి వివాహ వధూవరుల వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి కాపు/తెలగ కుల అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. ఆసక్తి గలవారు ఈనాడు కార్యాలయంలో ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చు. సంబంధిత కుటుంబీకులు నేడు (శనివారం, అక్టోబరు 5న), రేపు (ఆదివారం, అక్టోబరు 6న) ఉదయం 9 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. మరిన్ని వివరాలకు 91549 18858, 80080 01686 ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చు. ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఫోన్ ద్వారా కూడా చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయోడేటా, ఫొటోలను ఇక్కడ తెలిపిన వాట్సప్ నెంబర్లకు పంపవచ్చు. – న్యూస్‌టుడే, ఎంవీపీకాలనీ

6న ఉక్కు పరిరక్షణకు మానవహారం

ఉక్కునగరం(సెక్టార్-3), న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని సెయిల్‌లో విలీనం చేయడం, పూర్తిస్థాయిలో ఉత్పత్తికి చర్యలు ప్రారంభించడం, నిర్వాసితులకు ఉపాధి కల్పించడం.... వంటి డిమాండ్ల సాధనకు ఉక్కు పోరాట కమిటీ ఆధ్వర్యంలో 6న చేపట్టే మానవహారాన్ని జయప్రదం చేయాలని పోరాట కమిటీ నాయకులు సీహెచ్.నరసింగరావు, ఎం.రాజశేఖర్, డి.ఆదినారాయణ శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ అడ్డుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

డాబాగార్డెన్స్ (అల్లిపురం), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ కాకుండా అడ్డుకోవాలని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చింతా మోహన్ అన్నారు. డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'సూపర్ సిక్స్' ఎప్పటికి అమలు చేస్తారో ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చెప్పాలని, రాష్ట్ర రాజధానిని త్వరగా నిర్మించాలని అన్నారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి రూ.30వేల కోట్లు దేనికి ఖర్చు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. వేంకటేశ్వరస్వామి కొలువైన తిరుపతికి భాజపా, జనసేన పార్టీలు నష్టాన్ని కల్గిస్తున్నాయని ఆరోపించారు. తిరుమల పవిత్రతను కాపాడాలని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజల్లో ఆదరణ పెరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకుడు గార సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు వాల్తేరు కాన్‌క్లేవ్ శతాబ్ది వేడుకలు

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: వాల్తేరు కాన్‌క్లేవ్ నెంబరు:07 శతాబ్ది వేడుకలు (1924-2024) శనివారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ వేడుకలు బీచ్‌రోడ్డు పాత మున్సిపల్ కార్యాలయం పక్కనున్న హామిల్టన్ మెమోరియల్ మసానిక్ టెంపుల్‌లో జరుగుతాయన్నారు. ఇందులో భాగంగా అంధ బాలికల ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థులకు అవసరమైన బ్రెయిలీ కీబోర్డులతో కూడిన కంప్యూటర్లను అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

అప్పన్న ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు



పూజలందుకున్న అమ్మవార్లు

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి దేవాలయంలో శుక్రవారం నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు సంప్రదాయబద్ధంగా ప్రారంభమయ్యాయి.. తొమ్మిది రోజుల పాటు జరిగే శ్రీరామాయణం పారాయణను పురస్కరించుకుని రుత్విగ్వరుణం నిర్వహించారు. అనంతరం పండితులు ఆలయ హంసమూలన రామానుజుల విగ్రహం వద్ద శ్రీరామాయణం పారాయణానికి శ్రీకారం చుట్టారు. సాయంత్రం చతుర్భుజ తాయార్, స్వర్ణలక్ష్మీ అమ్మవార్ల తిరువీధి వేడుక ఆలయ బేడామండపంలో ఘనంగా జరిగింది.

★ **9 నుంచి వీరలక్ష్మీ ఆరాధన:** ఈ ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 9వ తేదీ నుంచి అప్పన్న ఆలయంలో వీరలక్ష్మీ ఆరాధన జరుగుతుందని ఈవో త్రినాథరావు తెలిపారు. ఆలయ ప్రాంగణంలోని సింహవల్లీ తాయార్ సన్నిధిలో చతుర్భుజ తాయార్, స్వర్ణలక్ష్మీ అమ్మవార్లకు విశేష పూజలు జరుగుతాయన్నారు. స్వామి వారికి అలంకరించే ఆభరణాలు, ఆయుధాలకు అర్చకులు పూజలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

★ **కొండ దిగువన శమీ పూజోత్సవం:** ఈనెల 13వ తేదీన విజయదశమిని పురస్కరించుకుని శమీ పూజోత్సవం వైభవోపేతంగా జరుగుతుందని ఈవో పేర్కొన్నారు. ఈ ఉత్సవాన్ని పురస్కరించుకుని ఆ రోజు మధ్యాహ్నం 3.30 గంటలకు స్వామివారు రామావతారంలో సింహగిరిపై నుంచి కొండ దిగువకు తరలివస్తారని పేర్కొన్నారు. పూలతోటలో పూజలందుకున్న తర్వాత జమ్మివేట వేడుకలో పాల్గొంటారన్నారు. ఈ వేడుక అనంతరం అడివివరంలో స్వామి వారి తిరువీధి జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఆ రోజు సాయంత్రం 6 గంటల నుంచి భక్తులకు స్వామివారి దర్శనాలు లభించవన్నారు. 14వ తేదీ ఉదయం 6.30 గంటల నుంచి యథావిధిగా దర్శనాలు కల్పిస్తామని వివరించారు.

కేజీహెచ్‌లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు



పిల్లల వార్డులో వసతులను పరిశీలిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

వన్‌టౌన్, న్యూస్‌టుడే: కేజీహెచ్‌లో కలెక్టర్ హరేంధిర ప్రసాద్ శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు కేజీహెచ్‌కు వచ్చిన ఆయన తొలుత వన్‌స్టాప్ కేంద్రానికి వెళ్లారు. అక్కడి పరిస్థితులు, కేంద్రం పనితీరుపై ఆరా తీశారు. తదుపరి చిన్నపిల్లలు చికిత్స వార్డుకు వెళ్లారు. వార్డు నవీకరణ పనుల పురోగతిని తెలుసుకొని సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు. కేజీహెచ్‌లో ఖైదీలకు కేటాయించే పడకల సంఖ్యను పెంచాలని వైద్యాధికారులను ఆదేశించారు. వైద్యసేవల విస్తరణ, వసతుల కల్పన, భవిష్యత్తులో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట ఆసుపత్రి పర్యవేక్షక వైద్యాధికారి డాక్టర్ కె.శివానంద, ఐసీడీఎస్ పీడీ జయదేవి, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ డీపీ నాయుడు ఉన్నారు.

'జిమ్సర్'లో ఫార్మకాలజిస్టుల జాతీయ సమావేశాలు



ప్రత్యేక సంచిక ఆవిష్కరిస్తున్న జిమ్సర్ ప్రొ-వీసీ డాక్టర్ బి.గీతాంజలి తదితరులు

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: గీతం డీమ్డ్ వర్సిటీకి అనుబంధంగా గల గీతం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్(జిమ్సర్) వేదికగా ఆంధ్రప్రదేశ్ ఫార్మకాలజిస్ట్స్ సొసైటీ శుక్రవారం నుంచి చేపట్టిన రెండు రోజుల ఫార్మకాలజిస్టుల జాతీయ సమావేశాల్ని జిమ్సర్ ప్రొ-వీసీ డాక్టర్ బి.గీతాంజలి ప్రారంభించారు. ఫార్మకాలజీ రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులకు తగిన విధంగా సిద్ధం కావాలని ఆమె సూచించారు. జిమ్సర్ డీన్ డాక్టర్ ఎస్.పి.రావు, సంబంధిత విభాగాధిపతి డాక్టర్ మాధవులు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.ఆర్.వసంత్‌కుమార్, ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం మాజీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.శంకర్, ఏపీ సంబంధిత విభాగం అధ్యక్షురాలు డాక్టర్ మీనాకుమారి, డాక్టర్ పద్మజ ఉదయ్‌కుమార్ తదితర నిపుణులు ప్రసంగించారు. అనంతరం సావనీర్(ప్రత్యేక సంచిక)ను ఆవిష్కరించారు.

'గ్లామ్ ఆన్ మిసెస్ ఇండియా'గా హేమలతా రెడ్డి



సీతంపేట, న్యూస్‌టుడే : నగరానికి చెందిన హేమలతా రెడ్డి మలేషియాలో జరిగిన 'గ్లామ్ ఆన్ మిసెస్ ఇండియా'గా నిలిచారు. ఈ పోటీల్లో ప్రపంచ వ్యాప్తంగా 300 మంది పాల్గొనగా తెలుగు మహిళ హేమలతా రెడ్డి ప్రథమ స్థానంలో నిలవడంపై స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ మేరకు విశాఖ పౌరగ్రంథాలయంలో శుక్రవారం విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, పైడా కృష్ణ ప్రసాద్, గంట్ల శ్రీనుబాబు, కందుల నాగరాజు సత్కరించి, ట్రోఫీ అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో ముందుండాలన్నారు. హేమలతారెడ్డిది విశాఖపట్నం కావడం గర్వకారణమన్నారు. ఆమె పలు టీవీ ఛానళ్లలోనూ, సీరియల్‌లలోనూ, సినిమాలలోనూ పనిచేసినట్లు తెలిపారు. ఒక సినిమాకు నిర్మాతగా వ్యవహరించినట్లు తెలిపారు. తాను త్వరలో ప్యారిస్ ఫ్యాషన్ వీక్‌కి వెళ్లనున్నట్లు ఆమె చెప్పారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	114	110
లైవ్	136	130
డ్రెస్డ్	197	230
స్కిన్‌లెస్	224	240

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

పెందుర్తి

తెరపై ఈనాడు
పెందుర్తిలో..
లక్ష్మీకాంత్
స్క్రీన్-1 - దేవర
స్క్రీన్-2 - స్వాగ్

వైభవంగా సహస్రనామార్చన

సింహాచలం, న్యూస్‌టుడే: సిరులొలికే సింహాద్రినాథుడికి శుక్రవారం సహస్రనామార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు వేకువజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన, బాలభోగం సేవలు జరిపారు. శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆసీనులను చేశారు. తులసీదళాలతో దేవతామూర్తులకు సహస్రనామార్చన జరిపారు. అనంతరం అదే వేదికపై స్వామి, అమ్మవార్ల నిత్య కల్యాణోత్సవాన్ని కనులపండువగా జరిపించారు.

మేమున్నాం.. మీకు తోడుగా 10 AM - 1 PM
పెందుర్తి : 90598 98721 వేపగుంట: 93472 79909

సమస్య: సబ్బవరం నుంచి చినగొల్లలపాలెం వెళ్లే దారిలో ఎస్‌టీబీఎల్ సినిమాహాలు వద్ద వ్యర్థాలు పేరుకుపోయాయి. గత 15 రోజులుగా చెత్తను తొలగించకపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు కుళ్లి తీవ్ర దుర్వాసన వస్తోంది. ఈగలు, దోమలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.
– సీహెచ్. వెంకటేశ్వరరావు, సబ్బవరం

సమాధానం: పరిశీలించి పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగిస్తాం. – కె.మూర్తిబాబు, పంచాయతీ కార్యదర్శి సబ్బవరం
– న్యూస్‌టుడే, సబ్బవరం

అ వీ ఇ వీ

■ **చీమలాపల్లి - పార్లుపాలెం రహదారి పనుల ప్రారంభం**

చీమలాపల్లి(వేపగుంట), న్యూస్‌టుడే: జీవీఎంసీ 95వ వార్డు చీమలాపల్లి - పార్లుపాలెం రహదారిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. భూగర్భ డ్రైనేజీ పనులు కారణంగా ఈ రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. దీంతో స్థానికులు నడవడానికి సైతం వీలులేకుండా పోయింది. దీనిపై 'ఈనాడు'లో పలుమార్లు కథనాలు వెలువడ్డాయి. కార్పొరేటర్ ముమ్మన దేముడు స్పందించి యూజీడీ విభాగం అధికారులతో మాట్లాడి ప్రమాదకరంగా ఉన్న ప్రదేశంలో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని సూచించారు. శుక్రవారం కార్పొరేటరు కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు.

యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యం

మధురానగర్(విజయవాడ), న్యూస్‌టుడే: నిరుద్యోగ యువతకు ఉపాధి చూపడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి సంస్థ (ఎం.ఎస్.ఎం.ఇ.డి.సి.) ఛైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్ పేర్కొన్నారు. శుక్రవారం విజయవాడ ముత్యాలంపాడులోని ఎం.ఎస్.ఎం.ఇ. కార్యాలయంలో ఛైర్మన్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ పేరిట యువతను మోసం చేసిందని విమర్శించారు. ఎం.ఎస్.ఎం.ఇ. ద్వారా యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేలా ప్రణాళిక సిద్ధం చేస్తామని తెలిపారు. ఉద్యోగాలంటే కేవలం ప్రభుత్వ కొలువులనే భావనను నిరుద్యోగ యువత విడనాడి ఎం.ఎస్.ఎం.ఇ. అందించే ప్రోత్సాహకాలను అందిపుచ్చుకొని పారిశ్రామికవేత్తలుగా స్థిరపడాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం 20 లక్షల ఉద్యోగాల హామీకి కట్టుబడి ఉందని, నైపుణ్య శిక్షణ కేంద్రాలు ఏర్పాటుకు ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. ఎం.ఎస్.ఎం.ఇ.పై తనకు అవగాహన ఉందని, దేశంలో ఏడో స్థానంలో ఉన్న ఏపీని అత్యున్నత స్థానానికి తీసుకువెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఎంఎస్ఎంఈ సెర్ప్ శాఖ అధికారి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, జనసేన గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రాయశ్చిత్తం అంటే వారికి తెలియదు

బూతులు మాట్లాడే వైకాపా నాయకులకు ప్రాయశ్చిత్తం అంటే తెలియదని శివశంకర్ పేర్కొన్నారు. మీడియా అడిగిన ప్రశ్నకు ఆయన బదులిస్తూ.. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేపట్టిన దీక్షపై విమర్శలు చేసే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న తమ్మిరెడ్డి శివశంకర్

కానిస్టేబుల్ అభ్యర్థుల్లో కోటి ఆశలు..

నియామక ప్రక్రియను త్వరలో ప్రారంభించనున్న కూటమి ప్రభుత్వం

వేపగుంట, న్యూస్‌టుడే



ప్రభుత్వ ఉద్యోగం అంటే ప్రతిఒక్కరికీ ఓ గుర్తింపు. పోలీసు శాఖలో ఉద్యోగం పొందితే ఆ ఆనందమే వేరు. అలాంటి శాఖలో ఉద్యోగం కోసం రెండేళ్లుగా వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువకులకు ఇటీవల హోంమంత్రి అనిత చేసిన ప్రకటన కొత్త ఊపిరినిచ్చింది. గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన కానిస్టేబుల్ ఉద్యోగాల నియామక ప్రక్రియను మరో వారం రోజుల్లో మొదలు పెడతామని హోంమంత్రి చెప్పడంతో గతంలో దరఖాస్తు చేసుకున్న వారంతా సంతోషంతో ఉన్నారు. దసరా పండగ వేళ కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడంతో ఎంతోమంది కుటుంబాల్లో కొత్త ఆశలు చిగురింప చేశాయంటున్నారు అభ్యర్థులు.

విశాఖ జిల్లాకు సంబంధించి..

గత ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 6100 కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీ కోసం 2022 నవంబరులో ప్రకటన విడుదల చేసింది. వీటిలో విశాఖ జిల్లాకు సంబంధించి 187 సివిల్ పోస్టులతో పాటు ఏపీఎస్పీకి సంబంధించి మరికొన్ని పోస్టులను మంజూరు చేసింది. రాష్ట్రం మొత్తం మీద దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ప్రాథమిక రాత పరీక్ష రాసి 95,208 మంది అర్హత సాధించారు. అనంతరం పీఎంటీ, పీఈటీ పరీక్షలు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ గత ప్రభుత్వం చేపట్టలేదు. దీంతో వారంతా నిరుత్సాహానికి గురయ్యారు. మరో ఉద్యోగానికి వెళ్ల లేక రెండున్నరేళ్లుగా గందరగోళానికి గురయ్యారు. ఎట్టకేలకు రాష్ట్ర హోంమంత్రి గతంలో నిలిచిపోయిన కానిస్టేబుల్ ఉద్యోగాల నియామక ప్రక్రియను పునఃప్రారంభిస్తామని ప్రకటించడంతో మళ్లీ అభ్యర్థుల్లో నూతన ఉత్సాహం వచ్చినట్టయింది. ఈ ప్రక్రియ సజావుగా జరిగితే త్వరలోనే పోతే రాష్ట్రవ్యాప్తంగా 6100 కానిస్టేబుల్స్ ఉద్యోగాల్లో యువతీయువకులు కొత్తగా కొలువుతీరే అవకాశం ఏర్పడుతుంది.



రూ.30 వేలు అప్పుచేసి కోచింగ్‌కు వెళ్లా..

అమ్మానాన్నా చనిపోయారు. నేను, చెల్లి ఉన్నాం. ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో రూ.30 వేలు అప్పు చేసి కోచింగ్ తీసుకున్నా. ప్రాథమిక పరీక్షల్లో పాసయ్యాను. వెంటనే మిగిలిన పరీక్షలు నిర్వహించి ఉంటే ఈ పాటికే ఉద్యోగంలో చేరేవాడ్ని. ఏది ఏమైనా ఆగిపోయిన ప్రక్రియ ప్రారంభించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం సంతోషకరం.
– బి.రవికుమార్, కానిస్టేబుల్ అభ్యర్థి, గవరజగ్గయ్యపాలెం బీసీ కాలనీ



ఈ ఉద్యోగం కోసం చాలా కష్టపడుతున్నా..

మానాన్న చనిపోయారు. అమ్మ గృహిణి. కానిస్టేబుల్ ఉద్యోగం కోసం చాలా కష్టపడ్డాను. చివరకు ప్రాథమిక పరీక్షల్లో అర్హత సాధించాను. అనంతరం ప్రక్రియ నిలిచిపోవడంతో గత్యంతరం లేక ప్రయివేటు సంస్థలో చిరు ఉద్యోగం చేస్తున్నాను. కానిస్టేబుల్ పోస్టుల భర్తీ ప్రక్రియ మరో వారంలో ప్రారంభమవుతుందంటే చాలా సంతోషంగా ఉంది. కానిస్టేబుల్ ఉద్యోగం సంపాదించి అమ్మకోరిక తీర్చుతా. – ఎన్.నరేంద్రకుమార్, కానిస్టేబుల్ అభ్యర్థి, దుర్గానగర్ కాలనీ



కుటుంబ పోషణ కోసం..

కానిస్టేబుల్ ప్రాథమిక రాత పరీక్షలో ఉత్తీర్ణుడయ్యాను. మిగిలిన ఫిజికల్ పరీక్షలు ప్రక్రియ నిలిచిపోవడంతో కుటుంబ పోషణ కోసం తాత్కాలికంగా ఓ ప్రయివేటు కంపెనీలో చేరాను. అయినా ఆర్థిక ఇబ్బందులే. కూటమి ప్రభుత్వ వచ్చిన వెంటనే ఆయా పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టడం శుభపరిణామం. గత ప్రభుత్వం మాదిరిలా కాకుండా వీలైనంత తొందరగా పోస్టులను భర్తీ చేయాలి.
– వినోద్‌కుమార్, కానిస్టేబుల్ అభ్యర్థి, గవరజగ్గయ్యపాలెం

సమస్యలు పరిష్కరించాలని ఆందోళన

పాలవలస(పరవాడ), న్యూస్‌టుడే: జీవీఎంసీ 77వ వార్డు పరిధి పాలవలస హిందుజా విద్యుత్తు కేంద్రం నిర్వాసితులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని వార్డు తెదేపా అధ్యక్షుడు పాల అచ్చిలనాయుడు డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హిందుజా విద్యుత్తు కేంద్రం ఎదుట శుక్రవారం పాలవలస గ్రామస్థులు చేపట్టిన ఆందోళన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. హిందుజా యాజమాన్యం ఇచ్చిన అగ్రిమెంట్ ప్రకారం మిగతా ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. హిందుజా యాష్‌పాండు నుంచి విడుదల అవుతున్న నీటి వల్ల దెబ్బతిన్న రైతుల పొలాలకు పరిహారం చెల్లించాలని, భూగర్భజలాలు కలుషితం కాకుండా కాపాడాలని, బొగ్గు, బూడిద లారీల కాలుష్యాన్ని అరికట్టాలన్నారు. తమ డిమాండ్లను పరిష్కరించని పక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామన్నారు. నిరసనలో చుక్క వెంకన్న, పాల నగేశ్, పాలరెడ్డి, కాకి అప్పలరెడ్డి, పిట్టా వెంకటరెడ్డి, వాకా పోలయ్య తదితరులు పాల్గొన్నారు.


నినాదాలు చేస్తున్న పాలవలస గ్రామస్థులు

ఇంటర్న్‌షిప్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి


శిక్షణ పొందుతున్న విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయిని చిన్నమ్మాయి

పెందుర్తి, న్యూస్‌టుడే: వృత్తి విద్య శిక్షణలో భాగంగా అందిస్తున్న ఇంటర్న్‌షిప్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పెందుర్తి పీఎంశ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని సీహెచ్.చిన్నమ్మాయి పేర్కొన్నారు. పెందుర్తిలోని మారుతీ కార్ల గ్యారేజీలో శిక్షణ పొందుతున్న విద్యార్థులను ఆమె శుక్రవారం కలిశారు. శిక్షణలో నేర్చుకుంటున్న వివరాలను ఆరా తీశారు. ఇంటర్న్‌షిప్ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఒకేషనల్ శిక్షకుడు మహేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదాయ వనరులు పెంచుకోవడంపై శిక్షణ

పెందుర్తి, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీలు ఆదాయ వనరులను పెంచుకోవడంపై పెందుర్తి టీటీడీసీ సమావేశ మందిరంలో మూడు రోజుల శిక్షణ కార్యక్రమం శుక్రవారం ప్రారంభించారు. ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన వివిధ మండలాల ఎంపీడీవోలు, ఈవోపీఆర్డీలు ఈ శిక్షణలో పాలుపంచుకున్నారు. కోర్సు డైరెక్టర్ కొల్లి వెంకటరావు, సహాయ డైరెక్టర్ కె.కరుణాకర్‌రావు ఆదాయ వనరులు పెంచుకోవడంపై అధికారులకు సూచనలు చేశారు. ఆయా అంశాలను క్షేత్ర స్థాయిలో అమలు చేసి పంచాయతీలను ఆర్థికంగా బలోపేతం చేయాలని సూచించారు.



మాట్లాడుతున్న కోర్స్ సహాయ డైరెక్టర్ కె.కరుణాకర్‌రావు

బదిలీపై వచ్చిన అధికారులు విధుల్లో చేరిక


ధనిశెట్టి శ్రీనివాస్ | బొండా చైతన్య | సీహెచ్ అప్పారావు

సబ్బవరం, న్యూస్‌టుడే: ఇటీవల చేపట్టిన బదిలీల్లో భాగంగా సబ్బవరం మండలానికి వచ్చిన అధికారులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా ధనిశెట్టి శ్రీనివాస్ అచ్యుతాపురం మండలం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈయన గతంలో గొలుగొండ, జి.మాడుగులలో పనిచేశారు. ఈయన స్వస్థలం కాకినాడ.

★ ఈవోపీఆర్‌డీగా బొండా చైతన్య వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఓ.మహేశ్ బదిలీపై చోడవరం వెళ్లగా అక్కడ పనిచేస్తున్న బొండా చైతన్య సబ్బవరం వచ్చారు. ఈమె గతంలో చీడికాడ, జీకేవీధి మండలాల్లో పనిచేశారు. ఈమె స్వస్థలం నక్కపల్లి మండలం గొడిచెర్ల.

★ డిప్యూటీ తహసీల్దారుగా సీహెచ్ అప్పారావు బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో పద్మనాభం, నర్సీపట్నం, గాజువాక, రోలుగుంట, చోడవరం, కోటపాడు, నాతవరం, అచ్యుతాపురం, అనకాపల్లి ఆర్డీవో కార్యాలయాల్లో వివిధ స్థాయిల్లో పనిచేశారు.

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండల ఈవోపీఆర్డీగా కె.ధర్మారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన అనకాపల్లి నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ ఈవోపీఆర్డీగా పనిచేసిన రమేశ్‌నాయుడు భీమిలికి బదిలీపై వెళ్లారు.

ఒత్తిడిని జయిస్తే జీవితం సుఖమయం

పెందుర్తి, న్యూస్‌టుడే: ఒత్తిడిని నియంత్రణలో ఉంచుకుంటే జీవితం సుఖమయంగా ఉంటుందని వ్యక్తిత్వ వికాస నిపుణుడు సీకే బాబు పేర్కొన్నారు. స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఒత్తిడి నిర్వహణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపల్ ఫ్లోరా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీకేబాబు పాల్గొని మాట్లాడారు. సమస్యలు సృష్టించే నిర్ణయాలు తీసుకోవడం, భావోద్వేగాలపై అవగాహన లేకపోవడం, అసూయ, ద్వేషం కారణంగా మనిషి ఒత్తిడికి గురవుతాడన్నారు. ఒత్తిడిని జయించే విధానాలను విద్యార్థులకు వివరించారు. కళాశాల కరస్పాండెంట్ డి.ఆదిబాబు, వైస్ ప్రిన్సిపల్ ఎ.శ్రీనివాసరావు, ఏవో జి.రవిబాబు పాల్గొన్నారు.


సూచనలిస్తున్న వ్యక్తిత్వ వికాస నిపుణుడు సి.కె.బాబు

సాయినాథుడి ఆలయానికి మహాద్వారం ఏర్పాటు

చినముషిడివాడ(పెందుర్తి), న్యూస్‌టుడే: జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ శ్రమశక్తినగర్ కాలనీలోని శ్రీ సాయినాథుడి ఆలయానికి మహాద్వారాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. కాలనీకి చెందిన శ్యామ్, వాసు వెంకటేశ్వరరావు, కొరారి శ్రీనివాస్ దంపతుల ఆర్థిక సాయంతో ఈ ద్వారం ఏర్పాటు చేస్తున్నట్లు కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం పూజలు నిర్వహించి దాతలను ప్రత్యేకంగా సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు సీహెచ్. రమణమూర్తి, వి.శంకర్‌ప్రసాద్, నూకరాజు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.


ఆలయ ద్వారాల ఏర్పాటు వేడుకలో పాల్గొన్న దాతలు, కాలనీ సంఘం ప్రతినిధులు

పోర్టులో ముగిసిన హిందీ పక్షోత్సవాలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: మేజర్ పోర్టుల్లో అధికార భాషా ప్రయోగాన్ని ప్రోత్సహించడం, పర్యవేక్షించడం కోసం కేంద్ర నౌకాయాన, పోర్టులు, జలవనరుల మంత్రిత్వ శాఖ సూచనల మేరకు విశాఖ పోర్టు అథారిటీ(వీపీఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన హిందీ పక్షోత్సవాలు శుక్రవారం ముగిశాయి. వీపీఏ పరిపాలన భవనంలోని సాంబమూర్తి ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో వీపీఏ ఉప ఛైర్మన్ దుర్గేష్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అధికార భాష వినియోగంలో దేశంలోని ప్రధాన పోర్టుల్లో వీపీఏ మూడోస్థానంలో నిలిచిందన్నారు. అనంతరం పోర్టు అధికారులు, సిబ్బందికి హిందీలో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ముఖ్య విజిలెన్స్ అధికారి పీఎస్ఏఎల్ స్వామి, కార్యదర్శి టి.వేణుగోపాల్, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

పాములకు ఆవాసంగా పచ్చికబయళ్లు


రహదారి పక్కన ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

వేపగుంట, న్యూస్‌టుడే: జీవీఎంసీ 98వ వార్డు షిప్‌యార్డ్ లేఅవుట్ పార్కు సమీపంలో పిచ్చిమొక్కలు పెరిగిపోయి పాములకు నిలయంగా మారాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తుప్పలు బాగా పెరిగిపోయాయి. దీంతో కాలనీవాసులు రాత్రివేళల్లో రాకపోకలు సాగించేందుకు భయపడుతున్నారు. ఇక్కడ పిచ్చిమొక్కలను తొలగించాలని సచివాలయం, జోనల్ కార్యాలయంలో పలుమార్లు ఫిర్యాదుచేసినా ఎవరూ పట్టించుకోలేదని కాలనీవాసులు అంటున్నారు. మరోవైపు ఈ ప్రాంతంలో వీధిదీపాలు పూర్తిస్థాయిలో లేవని స్థానికులు వాపోతున్నారు. పాలకులు, అధికారులు వెంటనే పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని వారంతా కోరుతున్నారు.

వార్డు సమస్యలపై వినతి

పరవాడ, న్యూస్‌టుడే: జీవీఎంసీ 77వ వార్డులోని సమస్యలను పరిష్కరించాలని వార్డు కార్పొరేటర్ బొట్టా సూర్యకుమారి కోరారు. ఈమేరకు జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌ను శుక్రవారం కలిసి సమస్యలను వివరించడంతో పాటు వినతిపత్రం అందజేశారు. వార్డులోని ఇంటింటికీ కుళాయి ద్వారా నీటిని సరఫరా చేయాలని, రోడ్లు, కాలువలు నిర్మాణానికి చర్యలు చేపట్టాలని, హైమాస్టు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, తుప్పపట్టిన స్తంభాలను మార్చాలని కమిషనర్‌ను కోరినట్లు కార్పొరేటర్ తెలిపారు.


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ సూర్యకుమారి


సుజాతనగర్‌లో గాయత్రీమాత


సప్తగిరినగర్‌లో ధాన్యలక్ష్మి


శారదాపీఠంలోని జగన్మాత


ఎస్ఆర్‌పురంలో..


ప్రహ్లాదపురం ప్రేమ్‌వర్క్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..


పిట్టవాని పాలెంలో..


కలపాక సామాజిక భవనం వద్ద..


లంకెలపాలెంలో..


శ్రీనివాసనగర్ దేవీసేన ఆధ్వర్యంలో..


నాయుడుతోట పంచముఖ గాయత్రీదేవి

వేద స్వరూపిణి.. జ్ఞాన ప్రదాయిని

గాయత్రీ అవతారంలో పూజలందుకున్న జగన్మాత


శ్రమశక్తినగర్ పంచముఖి గాయత్రి ఆలయంలో సామూహిక కుంకుమార్చన


బాలాజీగార్డెన్స్ అపార్ట్‌మెంట్‌లో భక్తుల పూజలు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం జగన్మాత వేద స్వరూపిణి గాయత్రీమాతగా పూజలందుకుంది. వివిధ ఆలయాలు, సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దసరా వేడుకల్లో భాగంగా ప్రత్యేక పూజలు జరిపారు. అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించి ఆరాధించారు. ఆలయాల్లో సామూహిక కుంకుమార్చనలు చేసి, వేదపారాయణాలు పఠించారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు భక్తులకు ఉచితంగా ప్రసాదాలు అందజేశారు.
– న్యూస్‌టుడే, పెందుర్తి, వేపగుంట, సబ్బవరం, పరవాడ


రవినగర్ కల్యాణ వేంకటేశ్వరుడి సన్నిధిలో పారాయణం చేస్తున్న భక్తులు


దేశపాత్రునిపాలెం హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో..


పాపయ్యరాజుపాలెం పిరమిడ్ కేంద్రంలో భక్తి గీతాలాపన


దేవీపురంలో సంగీత విభావరి

రేషన్ వినియోగదారుడిపై ఎండీఎం డ్రైవర్ దాడి

వేపగుంట, న్యూస్‌టుడే: రేషన్ బండి వద్దకు వెళ్లి ఈ నెల బియ్యం బస్తాలు తక్కువ తెచ్చావేంటి అని అడిగినందుకు ఎండీఎం వాహన డ్రైవరు రేషన్ వినియోగదారుడ్ని గాయపరిచిన ఘటన శుక్రవారం వేపగుంట సమీప వెంకటసాయినగర్‌లో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వెంకటసాయినగర్‌కు చెందిన గుదిరెడ్ల సోమినాయుడు ఎండీఎం వాహనం రాగానే రేషన్ తీసుకునేందుకు వాహనం వద్దకు వెళ్లాడు. రేషన్ లేదని ఎండీఎం వాహన నిర్వాహకుడు కంపర కిరణ్ చెప్పాడు. రేషన్ ఎందుకు తక్కువ తెచ్చావని సోమినాయుడు అడగడంతో ఇరువురి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘటనలో సోమినాయుడు ముఖంపై కిరణ్ బలంగా కొట్టడంతో ఎడమకన్ను భాగాన రక్తస్రావమైంది. వెంటనే సోమినాయుడు ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నాడు. ప్రభుత్వ ఈఎన్‌టీ ఆసుపత్రి వైద్యులు కేజీహెచ్‌కు చికిత్స నిమిత్తం పంపించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆసుపత్రిలోని బాధితుడి వద్దకు వెళ్లి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


గాయపడిన సోమినాయుడు

ధ్వంసమైన రహదారికి మరమ్మతులు

పరవాడ, న్యూస్‌టుడే

గాజువాక - ఎలమంచిలి ప్రధాన రహదారిలోని పరవాడ పైడిమాంబ ఆలయ సమీపంలో ధ్వంసమైన రహదారికి శుక్రవారం మరమ్మతులు చేపట్టారు. ఇక్కడ పెద్దపెద్ద గోతులు ఏర్పడి రాళ్లుదేలడంతో రాకపోకలు సాగించడానికి వాహనచోదకులు నానా ఇబ్బందులు పడేవారు. వర్షం పడితే గుంతలు చెరువులను తలపించడంతో పాటు వాహనాలు తరచూ గోతుల్లో మొరాయించేవి. 'భారీ గుంతలు.. వాహనాల మొరాయింపు' శీర్షికతో గతనెల 29న 'ఈనాడు'లో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. గుంతలను నల్ల పిక్కతో పూడ్చివేసి తారు వేయడంతో చోదకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



రహదారికి మరమ్మతులు చేస్తున్న దృశ్యం

ఈనాడు కథనానికి స్పందన

వానొచ్చినా.. ఎండొచ్చినా.. తిప్పలే..

దర్పణం

సబ్బవరం మండలం అసకపల్లి నుంచి లంకెలపాలెం వెళ్లే రహదారి దారుణంగా తయారైంది. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువును తలపించిన రోడ్డు ప్రస్తుతం ఎండలకు ఎండి బురదమయంగా మారింది. ద్విచక్ర వాహనదారులు బురదలో ప్రయాణించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏమాత్రం ఆదమరుపుగా ఉన్నా జారి గాయాలపాలవుతున్నారు. ఈ రహదారి అభివృద్ధికి గత వైకాపా ప్రభుత్వం రూ.9 కోట్లు మంజూరు చేసిందని ప్రకటించిందే తప్ప పనులు మాత్రం చేపట్టలేదు. రహదారిలో భారీ గుంతలు ఉండటంతో ఆటోలు, ద్విచక్ర వాహనదారులు లంకెలపాలెం నుంచి అనకాపల్లి మీదుగా సబ్బవరం చేరుకుంటున్నారు. అదనంగా 12 కి.మీ. ప్రయాణించాల్సి వస్తోందని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, అధికారులు దృష్టి సారించి రోడ్డు అభివృద్ధికి కృషి చేయాలని పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, సబ్బవరం




అలరించిన విద్యార్థినుల నృత్య ప్రదర్శన

సింహగిరిపై దసరా వేడుకలు

సింహాచలం: సింహాచలం దేవస్థానం సంస్కృతోన్నత పాఠశాల ఆధ్వర్యంలో శుక్రవారం సింహగిరిపై కళావేదిక వద్ద దసరా సంబరాలు ఘనంగా జరిగాయి. ప్రధానోపాధ్యాయిని భాను ఆధ్వర్యంలో విద్యార్థులు జానపద నృత్యాలు, పులివేషాలతో అలరించారు. దేవస్థానం ఈవో వేండ్ర త్రినాథరావు విద్యార్థులకు స్వామివారి ప్రసాదం, జ్ఞాపిక అందజేసి అభినందించారు. ఏదయా మీదయా.. అంటూ విద్యార్థులు ఆలపించిన అలనాటి దసరా పాట పాత రోజులను గుర్తు చేసింది. ఈ కార్యక్రమంలో ఏఈవోలు ఎన్.ఆనంద్‌కుమార్, రమణమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో సహాయకులకు నైపుణ్య శిక్షణ

ఈనాడు, అమరావతి: ఆస్పత్రుల్లో రోగుల పడకల వద్ద సహాయకులుగా పని చేసే వారికి అవసరమైన నైపుణ్య శిక్షణ అందించేందుకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ శ్రీసత్యసాయి సేవా ట్రస్ట్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. తాడేపల్లిలోని నైపుణ్యాభివృద్ధి సంస్థ కార్యాలయంలో శుక్రవారం ఈ ఒప్పందం జరిగింది. దీని ప్రకారం పదో తరగతి ఉత్తీర్ణులు, ఇంటర్మీడియట్, అండర్ గ్రాడ్యుయేట్ చదువు మధ్యలో నిలిపివేసిన వారు, నిరుద్యోగ యువతకు ఈ శిక్షణ ఇవ్వనున్నారు. ఆన్ జాబ్ శిక్షణతో కలిపి మొత్తం ఐదు నెలలు ఈ కోర్సు ఉంటుంది. శిక్షణ పూర్తయిన తర్వాత ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఒప్పందం కుదుర్చుకున్న కార్యక్రమంలో శ్రీసత్యసాయి సేవా ట్రస్ట్ ట్రస్టీ జి.సాయి విశ్వనాథం, ఏపీఎస్ఎస్‌డీసీ ఈడీ దినేశ్‌కుమార్, నర్సింగ్ నైపుణ్యాభివృద్ధి అధికారి రేహానాఖాన్ పాల్గొన్నారు.

‘ఆ జీఓను వెనక్కు తీసుకోవాలి’

ఈనాడు, అమరావతి: ఎసైన్డ్ భూముల్లో ఇసుక తవ్వుకోవడానికి అనుమతినిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీఓను వెనక్కి తీసుకోవాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కె.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ప్రభుత్వం పేదలకిచ్చిన ఎసైన్డ్ భూమిని మైనింగ్ తవ్వకాలకు, ఆక్వా చెరువులకు ఇవ్వకూడదని, పేదలు, వారి కుటుంబాలు తరతరాలుగా ఆ భూమిని అనుభవించే చట్టం ఉంటుందని పేర్కొన్నారు. ఈ చట్టాన్ని ఉల్లంఘించి రాష్ట్ర ప్రభుత్వం చేసిన నిర్ణయం దళితులు, పేదల వ్యతిరేకమైందని, ఇప్పటికే లక్షల ఎకరాల పేదల భూములను పెత్తందార్లు దోచుకుంటూ, అక్రమంగా అనుభవిస్తున్నారని ఆరోపించారు.

పన్నెండోసారి బెంగళూరుకు జగన్

ఈనాడు, అమరావతి: మాజీ సీఎం, వైకాపా అధ్యక్షుడు జగన్ శుక్రవారం మరోసారి బెంగళూరుకు వెళ్లారు. గత నెల 28న బెంగళూరుకు వెళ్లిన ఆయన మంగళవారం తిరిగొచ్చారు. మూడు రోజులకే మళ్లీ అక్కడికే పయనమయ్యారు. ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక జగన్ బెంగళూరుకు వెళ్లడం ఇది 12వ సారికావడం గమనార్హం.



ఫలితాలను తీసుకొచ్చేది పని మాత్రమే

మీరు బలంగా కోరుకున్నంత మాత్రాన ఏదీ మీకు దక్కదు. విద్య, సామర్థ్యాల్లాంటి అర్హతలు ఉన్నంత మాత్రాన ఏవీ వచ్చి మీ ఒళ్లో వాలవు. అమోఘమైన తెలివితేటలు మీకున్నా అన్నీ మీ దరి చేరవు. మీరు వేటి కోసమైతే నిజంగా కష్టపడి పనిచేస్తారో అవి మాత్రమే మిమ్మల్ని వరిస్తాయి. ఫలితాలను తీసుకొచ్చేది ఆశలు, ఆకాంక్షలు కాదు.. అంకితభావంతో స్థిరంగా పనిచేసే గుణమే.

– కోరీ విల్సన్, బిజినెస్ కన్సల్టెంట్

ఉన్నత విద్యలో ఆన్‌లైన్ పరీక్షల విధానం

- విశ్వవిద్యాలయాల్లో ఆన్‌లైన్‌లోనే ప్రశ్నపత్రాల రూపకల్పన
- కంప్యూటర్‌లో జవాబుపత్రాల మూల్యాంకనం
- మార్కులు ట్యాంపరింగ్ చేయకుండా పారదర్శకతకు ప్రభుత్వం చర్యలు

ఈనాడు, అమరావతి: విశ్వవిద్యాలయాల్లో పరీక్షల విధానాన్ని కంప్యూటరీకరణ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. డిగ్రీ, పీజీ పరీక్షల ఫలితాల్లో పారదర్శకత, మార్కుల్లో కచ్చితత్వం, పరీక్షల నిర్వహణను పటిష్ఠం చేసేందుకు ఈ విధానాన్ని తెస్తోంది. రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల్లో ‘సమగ్ర పరీక్షల నిర్వహణ విధానం’ అమలు చేయనుంది. గతంలో కాగ్ సైతం ప్రశ్నపత్రాల మూల్యాంకనంలో లోపాలు ఉన్నట్లు బహిర్గతం చేసింది. మొదట పరీక్షల్లో తప్పినా, పునర్ మూల్యాంకనంతో ఉత్తీర్ణులవుతున్న వారి సంఖ్య కొన్ని వర్సిటీల్లో 40% వరకు ఉంటోంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్సిటీలో గతంలో బీఈడీలో 52 మంది పునర్ మూల్యాంకనానికి దరఖాస్తు చేస్తే వీరిలో 30 మంది మార్కులు మారాయి. పీజీలో ఒక కోర్సుకు 80 మంది దరఖాస్తు చేస్తే 52 మందికి మార్కులు పెరిగాయి. ఆంధ్ర, ఆదికవి నన్నయ, ఎస్వీ యూనివర్సిటీల్లో పునర్ మూల్యాంకనం బాగోలేదని గతంలో కాగ్ హెచ్చరించింది. విశ్వవిద్యాలయాల్లో పరీక్షల నిర్వహణ విభాగానికి, ఇతర విభాగాలకు మధ్య సమన్వయం లేదు. గతంలో నాగార్జున వర్సిటీలో కొన్ని బీఈడీ కళాశాలలకు ప్రవేశాలకు అనుమతులు లేకపోయినా పరీక్షల విభాగం పరీక్షలు నిర్వహించి, ఫలితాలు ఇచ్చినట్లు ఆరోపణలున్నాయి. వర్సిటీల్లో ఇలాంటి పరిస్థితులను చక్కదిద్దే ప్రయత్నాలు మొదలయ్యాయి.

ఆన్‌లైన్ మూల్యాంకనం..

కొత్తగా తెచ్చే సంస్కరణల్లో భాగంగా ప్రశ్నపత్రాల మూల్యాంకనాన్ని ఆన్‌లైన్ చేయనున్నారు. పరీక్షలు పూర్తయ్యాక జవాబుపత్రాలను స్కానింగ్ చేస్తారు. అభ్యర్థి పేరు లేకుండా వీటికి కోడ్ కేటాయిస్తారు. అనంతరం వీటికి పాస్‌వర్డ్ పెడతారు. వర్సిటీల్లో ఈ విభాగం చూసే అధికారులు జవాబుపత్రాలను మూల్యాంకనం కోసం ఆన్‌లైన్‌లోనే అధ్యాపకులకు పంపిస్తారు. వారు కంప్యూటర్‌లోనే మూల్యాంకనం చేసి, సబ్మిట్ చేయగానే సంబంధిత అధికారికి ఇవి వస్తాయి.

★ మార్కులు రాగానే ఆటోమేటిగ్గా ఆయా వర్సిటీల లోగో, నమూనాతో మెమోల్లోకి ఈ మార్కులు వచ్చేస్తాయి. వీటిని డిజి లాకర్‌కు అనుసంధానిస్తారు. అభ్యర్థులు తమ మార్కుల మెమోలను డిజి లాకర్ నుంచి నేరుగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

★ పునర్ మూల్యాంకనానికి దరఖాస్తు చేసేవారికి అవసరమైతే వారు రాసిన జవాబుపత్రాలను అందించే అవకాశం ఉంటుంది. మూల్యాంకనం సైతం తొందరగా పూర్తవుతుంది. ఏటా అన్ని వర్సిటీల పరిధిలో 8 లక్షల మంది పరీక్షలు రాస్తున్నారు.

ప్రశ్నల బ్యాంకు ఏర్పాటు

ప్రశ్నపత్రాలనూ కంప్యూటర్ ద్వారానే రూపొందిస్తారు. సబ్జెక్టుల వారీగా ప్రశ్నలబ్యాంకును ఏర్పాటు చేస్తారు. వాటిలో నుంచి ఆన్‌లైన్‌లోనే ప్రశ్నపత్రం రూపొందిస్తారు. ప్రశ్నపత్రాలను ఆన్‌లైన్‌లో పంపించాలని భావిస్తున్నా క్షేత్రస్థాయి పరిస్థితుల కారణంగా మొదట్లో కొంతకాలం ముద్రించిన ప్రశ్నపత్రాలను పంపాలని నిర్ణయించారు. ప్రశ్నపత్రాలను ముద్రించడం, వాటిని సరఫరా చేయడం లాంటివి లేకుండా పరీక్షకు 15 నిమిషాల ముందు ప్రశ్నపత్రాన్ని ఆన్‌లైన్‌లో పాస్‌వర్డ్‌తో పంపించి, వాటిని ప్రింట్లు తీసుకొని, అభ్యర్థులకు ఇచ్చే విధానంపై ఆలోచన చేస్తున్నారు.

★ వర్సిటీల్లో పరీక్షల విభాగం కంప్యూటరీకరణ ప్రక్రియ కోసం ప్రైవేటు సాఫ్ట్‌వేర్ సంస్థలను ఎంపిక చేసేందుకు ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ ద్వారా ఉన్నత విద్యాశాఖ టెండర్లు పిలిచింది. ఈ నెల 15 వరకు బిడ్లు స్వీకరిస్తుంది. సంస్థలను ఎంపిక చేశాక ఉన్నత విద్యాశాఖ వర్సిటీలకు కేటాయించనుంది.

కర్ణాటకలో లేని ప్రైవేటీకరణ విశాఖలో ఎందుకు?

- ఉక్కు పరిశ్రమకు సొంత గనులు కేటాయించాలి
- సీపీఐ రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు



విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణపై రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న పీసీసీ అధ్యక్షురాలు షర్మిల. చిత్రంలో మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తదితరులు

ఈనాడు డిజిటల్, అమరావతి: కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి తన రాష్ట్రంలోని మూతపడిన ఫ్యాక్టరీని తిరిగి ప్రారంభించుకున్నారని, 23 మంది ఎంపీలు ఉన్నా.. ఎన్డీయే ప్రభుత్వం విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఎందుకు అడ్డుకోవడంలేదని వక్తలు ప్రశ్నించారు. పదేళ్లుగా రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా భాజపాకే మద్దతిచ్చాయని, ఒక్క విభజన హామీని అమలు చేయకున్నా ఊడిగం చేశాయని మండిపడ్డారు. విజయవాడలోని సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నేతలతో విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఫ్యాక్టరీకి సొంత గనులు కేటాయిస్తే అదే లాభాల్లోకి వస్తుందని అన్నారు. ప్రైవేటీకరణ ఆలోచన మానుకోవాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి లేఖ అందించాలని నిర్ణయించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల మాట్లాడుతూ.. ‘ప్రస్తుతం భాజపా కేంద్రంలో అధికారంలో ఉండటానికి కారణం తెదేపా ఎంపీలే. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వారు ఎందుకు మాట్లాడటంలేదు. కాంగ్రెస్ పార్టీ చిల్లర రాజకీయాలు చేస్తోందని ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి అంటున్నారు. కానీ అవి చేసేది భాజపానే. యూపీఏ అధికారంలో ఉన్నన్ని రోజులూ ఫ్యాక్టరీ లాభాల్లోనే ఉంది. భాజపా అధికారంలోకి వచ్చాకే అప్పుల పాలైంది’ అని విమర్శించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ.. ‘ప్రైవేటీకరణ చేయాలనేది రాజకీయ నిర్ణయం. 10 ఏళ్లుగా ఆందోళనలు చేస్తున్నా.. ప్రైవేటీకరణే మా విధానమని నేరుగా చెబుతున్నారు. ప్రతిపక్ష నేతలుగా మాట్లాడే హక్కు మాకుంది. రాజకీయ పార్టీలు, నాయకులు, విద్యార్థులు, మేధావులు దీనిపై మాట్లాడాలి. భాజపా నాయకులు ప్రైవేటీకరణ చేస్తామని చెబుతుంటే తెదేపా, జనసేన పార్టీలు మాత్రం రోజుకో మాట మాట్లాడుతున్నాయి’ అని మండిపడ్డారు. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ ‘విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు గనులు కేటాయిస్తే ఏటా రూ.3వేల కోట్ల లాభాలు ఆర్జిస్తుంది. ప్రకాశం జిల్లా టంగుటూరు మండలంలోని మర్లపాడులో సుమారు 1,300 ఎకరాల్లోని గనులను జిందాల్ కంపెనీకి కేటాయించారు. వాటిని విశాఖ ఉక్కు పరిశ్రమకు కేటాయించాలి’ అని కోరారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ‘ప్రైవేటీకరణ చేయడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది. అందుకే ప్లాంట్‌కు రావాల్సిన గనులను తొలగిస్తోంది. ప్రైవేటీకరణ చేసి అదానీకి అప్పజెప్పాలని చూస్తోంది’ అని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు నర్సింగరావు, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

దర్యాప్తునకు సహకరించండి

- వైకాపా నేత సజ్జలకు హైకోర్టు ఆదేశం
- ముందస్తు బెయిలు పిటిషన్‌పై విచారణ 25కు వాయిదా

ఈనాడు, అమరావతి: తెదేపా కేంద్ర కార్యాలయంపై మూకుమ్మడి దాడి కేసులో దర్యాప్తునకు సహకరించాలని వైకాపా నేత సజ్జల రామకృష్ణారెడ్డిని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఈనెల 25కు వాయిదా వేసింది. అప్పటి వరకు ఆయన అరెస్టు విషయంలో తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులకు స్పష్టంచేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ శుక్రవారం ఈమేరకు ఉత్తర్వులు జారీచేశారు. తెదేపా కార్యాలయంపై దాడి కేసులో తనను నిందితుడిగా చేర్చారని, వాస్తవానికి ఈ వ్యవహారంతో తనకు సంబంధం లేదని, ముందస్తు బెయిలు మంజూరు చేయాలని కోరుతూ సజ్జల రామకృష్ణారెడ్డి హైకోర్టులో వ్యాజ్యం వేసిన విషయం తెలిసిందే. సజ్జల రామకృష్ణారెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. తెదేపా కార్యాలయంపై దాడి ఘటన రోజున పిటిషనర్ పోరుమామిళ్లలో, ఘటనా స్థలానికి 600 కి.మీ దూరంలో ఉన్నారని కోర్టుకు నివేదించారు. ప్రాసిక్యూషన్ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా, పీపీ మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపించారు.

దాడి ఘటన రోజు సజ్జల రామకృష్ణారెడ్డి తాడేపల్లి వైకాపా కార్యాలయంలో ఉన్నట్లు ఇద్దరు సహ నిందితులు, ఇద్దరు సాక్షులు వాంగ్మూలాలు ఇచ్చారని తెలిపారు. దేవినేని అవినాష్ అనుచరుడు, ఈ కేసులో 13వ నిందితుడు షేక్ సైదా ఇచ్చిన వాంగ్మూలంలో ఆ రోజు సాయంత్రం 3 గంటలకు వైకాపా కార్యాలయంలో పిటిషనర్‌ను చూసినట్లు వెల్లడించారన్నారు. సజ్జల ప్రోద్బలంతోనే దాడి చేసినట్లు షేక్ సైదా చెప్పారని తెలిపారు. దాడి ఘటనలో సజ్జల రామకృష్ణారెడ్డి పాత్ర ఉన్నట్లు ఆధారాలు లభించాయని పేర్కొన్నారు.

నందిగం సురేష్‌కు షరతులతో బెయిలు

దర్యాప్తునకు అందుబాటులో ఉండాలన్న హైకోర్టు

ఈనాడు, అమరావతి: తెదేపా కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో వైకాపా మాజీ ఎంపీ నందిగం సురేష్, వైకాపా సానుభూతిపరుడు అవుతు శ్రీనివాస రెడ్డిలకు హైకోర్టు షరతులతో కూడిన రెగ్యులర్ బెయిలు మంజూరు చేసింది. మంగళగిరి మొదటి తరగతి అదనపు జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో రూ.15వేలతో రెండు పూచీకత్తులు సమర్పించాలని ఆదేశించింది. అభియోగపత్రం దాఖలు చేసేవరకూ ప్రతి నెలా 1, 15వ తేదీల్లో ఉదయం పది నుంచి మధ్యాహ్నం 1 గంటలోపు ఏదో ఒక సమయంలో దర్యాప్తు అధికారి (ఐఓ) ముందు హాజరుకావాలని ఇద్దరినీ ఆదేశించింది. దర్యాప్తు నిమిత్తం పోలీసులు కావాలన్నప్పుడల్లా అందుబాటులో ఉండాలని పిటిషనర్లకు తేల్చిచెప్పింది. ఈ కేసులో ఎవరినీ ప్రలోభపెట్టడం, బెదిరించడం చేయవద్దని ఆదేశించింది. ఇలాంటి నేర ఘటనలను పునరావృతం చేయవద్దని స్పష్టం చేసింది. దిగువ కోర్టులో విచారణ ప్రక్రియలో పాల్గొనాలని పేర్కొంది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ శుక్రవారం ఈ మేరకు తీర్పు చెప్పారు.

★ పోలీసులకు నందిగం సురేష్ మొబైల్ ఫోన్లను అప్పగించకపోవడాన్ని దర్యాప్తునకు సహకరించనట్లుగా చెప్పలేమని న్యాయమూర్తి అభిప్రాయపడ్డారు. పిటిషనర్లను సెప్టెంబరు 4న అరెస్టు చేశారని, నెల రోజులుగా జ్యుడిషియల్ కస్టడీలో ఉన్నారని గుర్తుచేశారు. పోలీసు కస్టడీ పూర్తయిందన్నారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని బెయిలు మంజూరు చేస్తున్నట్లు న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు.

ఏఆర్ డెయిరీ ఎండీ ముందస్తు బెయిలు పిటిషన్ 17కు వాయిదా

ఈనాడు, అమరావతి: ఏఆర్ డెయిరీ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఎండీ ఆర్.రాజశేఖరన్ హైకోర్టులో దాఖలు చేసిన ముందస్తు బెయిలు పిటిషన్‌పై విచారణ ఈ నెల 17కు వాయిదా పడింది. శ్రీవారి లడ్డూ తయారీకి జంతువుల కొవ్వుతో కల్తీ చేసిన నెయ్యి సరఫరా చేశారన్న ఆరోపణలతో తనపై తిరుపతి తూర్పు ఠాణాలో సెప్టెంబరు 25న నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిలు మంజూరుచేయాలని రాజశేఖరన్ హైకోర్టులో పిటిషన్ దాఖలుచేశారు. శుక్రవారం నాటి విచారణలో పిటిషనర్ తరఫు న్యాయవాది స్పందిస్తూ.. లడ్డూ విషయమై సుప్రీంకోర్టులో చోటుచేసుకున్న పరిణామం నేపథ్యంలో తమ పిటిషన్‌ను ఈ నెల 17కు వాయిదా వేయాలని కోరారు. అందుకు అంగీకరించిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ విచారణను వాయిదా వేశారు.

సీఈ, సీసీపీ బాధ్యతల స్వీకరణ



శివప్రసాద రాజు



ప్రభాకర్

కార్పొరేషన్, న్యూస్‌టుడే: మహా విశాఖ నగరపాలక సంస్థ ప్రధాన ఇంజినీరుగా శివ ప్రసాదరాజు, ప్రధాన పట్టణ ప్రణాళికాధికారిగా ప్రభాకర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ జీవీఎంసీ సీసీపీ, సీఈలను విజయవాడ బదిలీ చేసింది. వారి స్థానంలో విజయవాడ నుంచి జీవీఎంసీకి బదిలీ చేసింది. గతంలో ఇరువురూ ఇక్కడ పనిచేసిన అనుభవం ఉంది. పర్యవేక్షక ఇంజినీరుగా శివప్రసాదరాజు పనిచేయగా, నగర ప్రణాళికాధికారిగా ప్రభాకర్ పని చేశారు.

రూ.63,266 కోట్లతో జిల్లా వార్షిక రుణ ప్రణాళిక

వన్‌టౌన్, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు, పారిశ్రామిక రంగ ఔత్సాహికులు, రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని రూ.63,266.10 కోట్లతో రూపొందించిన వార్షిక జిల్లా రుణ ప్రణాళికను కలెక్టర్ హరేంధిర ప్రసాద్ శుక్రవారం విడుదల చేశారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం బ్యాంకు అధికారులతో నిర్వహించిన జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో ఆయన రుణ ప్రణాళికను బ్యాంకు అధికారులతో కలిసి విడుదల చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా స్థూల విలువ జోడింపు(జీవీఏ)లో రెండంకెల వృద్ధిని సాధించడంతో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు రుణ ప్రణాళిక దోహదపడుతుందన్నారు. సమావేశంలో ఎల్‌డీఎం ఎం.శ్రీనివాసు, రిజర్వ్ బ్యాంకు ప్రతినిధి పి.పూర్ణిమ, నాబార్డు డీజీఎం సుమంత్‌కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి అప్పలస్వామి, డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



వార్షిక రుణ ప్రణాళికను విడుదల చేస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, వివిధ శాఖల అధికారులు

‘స్థాయీ’లో అంశాలపై సభ్యుల నిలదీత

ప్లాస్టిక్ స్క్వాడ్ తొలగింపు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: మహా విశాఖ నగరపాలక సంస్థ స్థాయీ సమావేశం శుక్రవారం వాడీవేడిగా జరిగింది. ఇష్టానుసారంగా ప్రతిపాదనలు పెడుతూ, వివరాలను పొందుపరచడంలేదని, ఆధారాలను సమర్పించకుండా ఏ విధంగా వాటిని అనుమతిస్తామని స్థాయీ సభ్యులు గల్లా చిన్నా, బొమ్మిడి రమణ అధికారులను ప్రశ్నించారు. పని జరిగినట్లు, దానికి ఎంత మొత్తంలో వ్యయం చేసామన్న వివరాలు తప్ప, ఆయా పనుల్లో వినియోగించిన పరికరాలు, ఏ కంపెనీ నుంచి తీసుకుంటున్నారన్న విషయాలను తెలియజేయకపోవడం సరికాదంటూ కొన్ని అంశాలను సభ్యులు వాయిదా వేశారు. వైకాపా కార్పొరేటర్లు స్థాయీ సభ్యులుగా ఉన్న సమయంలో ఎలాంటి చర్చ లేకుండానే అంశాలను ఆమోదించిన మేయర్, స్థాయీ ఛైర్‌పర్సన్ గొలగాని హరి వెంకట కుమారి ప్రస్తుతం జరుగుతున్న చర్చ పట్ల సానుకూలంగా స్పందించారు. శుక్రవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన స్థాయీ సమావేశంలో 124 అజెండా అంశాలు, 19 టేబుల్ అజెండా అంశాలపై చర్చించిన సభ్యులు 12 అంశాలు వాయిదా వేసి, అనకాపల్లి మార్కెట్ లీజు ఇచ్చే అంశాన్ని పూర్తిగా రద్దు చేసి, తిరిగి వేలం వేయాలని సూచించారు.



స్థాయీ సంఘ సమావేశంలో సభ్యులు, ఛైర్‌పర్సన్ గొలగాని హరి వెంకట కుమారి

ప్లాస్టిక్ స్క్వాడ్‌పై: గత కమిషనర్ సాయికాంత్ వర్మ హయాంలో పాలకవర్గానికి తెలియకుండా నియమించిన ప్లాస్టిక్ స్క్వాడ్ బృందం సభ్యులు 32 మందిని తొలగించడంతో పాటు, వారు వినియోగిస్తున్న 8 వాహనాలను తక్షణమే వెనక్కు తీసుకోవాలని స్థాయీ సభ్యులు విల్లూరి భాస్కరరావు, గొలగాని వీరారావు ఛైర్‌పర్సన్‌ను కోరారు. వారికి ఇవ్వాల్సిన వేతనాలకు అనుమతిస్తూ, తొలగింపు చేపట్టాలని కోరారు.

★

మా వార్డులో పనులు ప్రతిపాదించడంలేదు: కొండవాలు ప్రాంతాల్లో పనులు పెట్టారని, 7వ వార్డులో ఇటీవల కురిసిన వర్షానికి కొండవాలు ప్రాంత ప్రజలు ఇబ్బంది పడ్డారని, ఆయా ప్రాంతాలలో చేపట్టాల్సిన పనులపై వినతులిచ్చినా, పనులెందుకు ప్రతిపాదించలేదని పిల్లా మంగవేణి ప్రశ్నించారు. దీంతో మేయరు మాట్లాడుతూ వచ్చే సమావేశంలో పెట్టేలా అధికారులను ఆదేశించారు.

ఈవెంట్లు పెట్టి నిధులు కొల్లగొడుతున్నారు: నగరంలోని ఓ స్వచ్ఛంద సంస్థ స్వచ్ఛభారత్ కార్యక్రమాలు స్వచ్ఛందంగా చేపడతామని జీవీఎంసీని ఆశ్రయించి, అప్పటి అదనపు కమిషనర్‌ను ఒప్పించి 300 మంది పాఠశాల విద్యార్థులతో వారి తల్లిదండ్రులకు స్వచ్ఛతపై లేఖలు రాయించారు. అదే సంస్థ ఎకో వైజాగ్ మెగా ఆర్ట్ కాంటెస్ట్ పేరిట ఓ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఆయా కార్యక్రమాలకు కొంత మంది స్పాన్సర్లు సైతం సాయం చేశారు. శుక్రవారం జరిగిన స్థాయీ సమావేశంలో ఆయా కార్యక్రమాల నిర్వహణకు రూ.4.88లక్షలు, రూ.3.70 లక్షలు సంస్థకు చెల్లించడానికి అంశాలను ప్రవేశపెట్టారు. జీవీఎంసీతో సంబంధం లేని ఓ సంస్థ నిర్వహించిన ఈవెంట్లకు లక్షల్లో ప్రజాధనం ఇవ్వడంపై సభ్యులు చర్చించినా, తెదేపా నాయకుడొకరు వాటిని ఆమోదించాలని ఒత్తిడి చేయడంతో నిధులు ఇవ్వడానికి అంగీకరించారు. ఆడుదాం-ఆంధ్ర పేరిట చేసిన వ్యయాలకు సంబంధించిన అంశాలను వాయిదా వేశారు. టేబుల్ అజెండాలో 96వ వార్డులో రూ.4.93కోట్ల అభివృద్ధి పనులను ప్రతిపాదించారు. తెదేపా ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు అభ్యర్థన మేరకు పనులు అధికారులు పెట్టారు. సమావేశంలో స్థాయీ సభ్యులు పులి లక్ష్మీబాయి, నొల్లి నూకరత్న పాల్గొనగా, ముగ్గురు సభ్యులు సమావేశానికి గైర్హాజరయ్యారు.

ఏయూకు ఐఎస్ఓ గుర్తింపు కొనసాగింపు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్రవిశ్వవిద్యాలయానికి ఐ.ఎస్.ఒ. గుర్తింపును పొడిగిస్తూ 2027 సెప్టెంబర్ 6 వరకు కొనసాగించనున్నారు. ఇటీవల ఏయూను సందర్శించిన ఐ.ఎస్.ఒ. నిపుణుల బృందం ఇక్కడ వివిధ అంశాలను పరిశీలించి కొనసాగిస్తూ ఉత్తర్వులను జారీ చేసింది. సంబంధిత ధ్రువపత్రాన్ని ఏయూ ఐక్యూఏసీ సమన్వయకర్త ఆచార్య జి.గిరిజాశంకర్.. వీసీ ఆచార్య జి.శశిభూషణరావుకు శుక్రవారం అందించారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య ఎన్.కిశోర్‌బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, అకడమిక్ డీన్ ఆచార్య కె.ఈశ్వరకుమార్, ప్రిన్సిపాళ్లు ఎ.నరసింహారావు, నాగరాజకుమారి తదితరులు పాల్గొన్నారు.



వీసీ ఆచార్య జి.శశిభూషణరావు సమక్షంలో ఐ.ఎస్.ఒ. ధ్రువపత్రాన్ని చూపిస్తున్న రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు

ప్రజాప్రతినిధులు లేకుండానే వీఎంఆర్‌డీఏ ఆవిర్భావ దినోత్సవం!

ఈనాడు, విశాఖపట్నం: వీఎంఆర్‌డీఏ అధికారుల తీరు తీవ్ర విమర్శలకు తావిస్తోంది. కూటమి ప్రభుత్వ ప్రజాప్రతినిధులను పలు కార్యక్రమాలకు ఆహ్వానించటం లేదని, ఇది సరికాదని చెబుతున్నారు. గతంలో మల్లికార్జున కమిషనర్‌గా ఉండగా కైలాసగిరి కొండపై అభివృద్ధి పనులు ఆయన చేతుల మీదుగా ప్రారంభించడం వివాదాస్పదమైంది. స్థానిక ఎమ్మెల్యేకు సమాచారం లేకుండానే కార్యక్రమం నిర్వహించేశారు. శుక్రవారం వీఎంఆర్‌డీఏ ఆవిర్భావం పేరుతో చేపట్టిన కార్యక్రమాన్నీ అలాగే చేయడాన్ని తప్పుపడుతున్నారు. వీఎంఆర్‌డీఏ ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉన్న తరుణంలో ఆడంబరంగా కార్యక్రమం చేపట్టడాన్ని కొందరు విమర్శిస్తున్నారు. వాస్తవానికి సెప్టెంబర్‌లో ఆవిర్భావ దినోత్సవం చేయాలి. విజయవాడలో వరదల నేపథ్యంలో ఆపేశారు. అక్టోబరు నాలుగున సాంస్కృతిక కార్యక్రమాలు, పోటీలు, రాత్రి విందు భోజనాలతో కార్యక్రమం చేపట్టడంపై ఆరోపణలు వస్తున్నాయి. గతంలో సమావేశం నిర్వహించినా కేకు కోసి బాధ్యతలను గుర్తు చేసేలా నిర్వహించేవారు.

★ పని ప్రదేశంలో ఉద్యోగులకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తే మరింత రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తారని ఇది సంస్థను మరింత ముందుకు నడిపేందుకు దోహదపడుతుందని వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్ అన్నారు. శుక్రవారం వీఎంఆర్‌డీఏ బాలల ప్రాంగణంలో సంస్థ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కమిషనర్ ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. సంయుక్త కమిషనర్ రమేష్, సీఈ భవానీశంకర్, సీయూపీ శిల్పా, సీఏవో హరిప్రసాద్, డీఎఫ్‌వో శాంతిస్వరూప్, ఎస్ఈ బలరామరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ విశ్వనాథన్

బరి తెగించిన గంజాయి స్మగ్లర్లు

సినీ ఫక్కీలో పోలీసుల ఛేజింగ్

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: గంజాయి అక్రమ రవాణా చేస్తున్న నిందితులను పట్టుకునేందుకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు సినీ ఫక్కీ నిర్వహించారు. బరితెగించిన గంజాయి స్మగ్లర్లు పోలీసు ద్విచక్ర వాహనాన్ని కారుతో ఢీకొట్టి మరీ తప్పించుకుని పారిపోయారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గంజాయి అక్రమ రవాణాపై వచ్చిన సమాచారంతో టాస్క్‌ఫోర్స్ సి.ఐ. భాస్కరరావు, ఎస్.ఐ. భరత్‌కుమార్ రాజు సిబ్బందితో ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద మాటు వేసి ఉన్నారు. గంజాయి కొనుగోలుదారులుగా ఉన్న పోలీసులు అనుమానితుల కదలికలను గమనిస్తున్నారు. ఇంతలో నిందితులు కారులో వచ్చారు. అప్పటికే పోలీసులను గమనిస్తున్న మరో వ్యక్తి వెంటనే కారులోకి ఎక్కడంతో అక్కడ నుంచి ముందుకు కదిలారు. దీంతో పోలీసులు వారిని వెంబడించారు. సంగమ్‌శరత్ కూడలి వద్ద సిగ్నల్ పడటంతో వెనుకే వచ్చిన పోలీసు కానిస్టేబుల్ తన ద్విచక్రవాహనాన్ని కారు ముందు ఉంచారు. మరి కొంతమంది పోలీసులు కారు వద్దకు వెళ్లి అద్దాలు దించాలని సూచించారు. దీంతో వారు ఒక్కసారిగా కారును అక్కడ నుంచి పోనిచ్చి ముందు ఉన్న కానిస్టేబుల్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి అమిత వేగంతో వెళ్లిపోయారు. ఈ సంఘటనలో పోలీసులకు ఎలాంటి గాయాలు కాలేదు. ద్విచక్రవాహనం కొంత మేర దెబ్బతింది. ఈ సంఘటన నుంచి తేరుకున్న పోలీసులు కారును వెంబడిస్తూ బయలుదేరారు. సమీప సీసీ కెమెరాలను పరిశీలించగా షీలానగర్ సమీపంలో కారును వదిలేసి అక్కడ నుంచి నిందితులు పారిపోయినట్లు గుర్తించారు. కారులో ఉన్న లీటర్ ద్రవరూప గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.



పోలీసులకు చిక్కిన కారు

ఏపీటీడీసీ శక్తిపీఠాల ప్యాకేజీ

ఈనాడు, విశాఖపట్నం: తెలుగు రాష్ట్రాల్లోని శక్తి పీఠాలకు ఎంతో ప్రాధాన్యం ఉంది. ఈ నేపథ్యంలో ప్రజలు వాటిని సందర్శించేలా ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) ఒక ఆధ్యాత్మిక పర్యాటక ప్యాకేజీని అందుబాటులోకి తీసుకొచ్చింది. విశాఖ నుంచి ప్రారంభమయ్యే ఈ ప్యాకేజీని ప్రతి శుక్రవారం నిర్వహించనున్నారు. ఆ రోజు మధ్యాహ్నం ఒంటి గంటకు విశాఖలో బయలుదేరి అదే రోజు పిఠాపురం, ద్రాక్షారామంలోని పీఠాలను చూపించి రాత్రికి విజయవాడలో బస ఏర్పాటు చేస్తారు. రెండో రోజు కనకదుర్గమ్మ దర్శనం చేయిస్తారు. అనంతరం అక్కడి నుంచి సాయంత్రానికి శ్రీశైలం చేరుకొని మల్లికార్జున, భ్రమరాంబ అమ్మవార్ల దర్శనంతో పాటు స్థానిక ప్రాంతాల సందర్శన ఉంటుంది. మూడో రోజు తెలంగాణ ఆలంపురంలో జోగులాంబ దర్శనం అనంతరం విశాఖకు తిరుగు పయనం అవుతారు. పెద్దలకు రూ.5,980, పిల్లలకు రూ.4,790గా ప్యాకేజీ ధర నిర్ణయించారు. వివరాలకు ఏపీటీడీసీ వెబ్‌సైట్‌లో చూడొచ్చు. ఈ ఆధ్యాత్మిక ప్యాకేజీ నాలుగో తేదీ నుంచే ఆరంభం కావాల్సి ఉన్నా టికెట్లు బుక్ చేసుకోకపోవడంతో రద్దు చేశారు.

ఆధునిక పద్ధతులతో ఐడీబీ వ్యాధులకు చికిత్స

ఏఐజీ ఛైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వరరెడ్డి సూచన



మాట్లాడుతున్న ఏఐజీ ఛైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వరరెడ్డి, వేదికపై పాల్గొన్న వైద్య ప్రముఖులు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఆధునిక పద్ధతులతో పేగుపూత వ్యాధుల(ఐబీడీ)ను నయం చేయవచ్చునని ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ(ఏఐజీ) ఛైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వరరెడ్డి అన్నారు. మూడురోజుల పాటు విశాఖలోని ఓ ప్రైవేటు హోటల్లో ఐబీడీపై నిర్వహించనున్న జాతీయ సదస్సును శుక్రవారం నాగేశ్వరరెడ్డి ప్రారంభించి మాట్లాడారు. టీమ్‌బిల్డింగ్ ట్రీట్‌మెంట్ మెథడాలజీ ప్రక్రియ ద్వారా ఐబీడీ రోగులకు స్వాంతన చేకూర్చవచ్చునన్నారు. పేగుపూత వ్యాధుల నిర్ధారణ, చికిత్స పద్ధతుల్లో ఆధునిక విధానాలు అందుబాటులోకి వచ్చాయని, వాటిని ఆకళింపు చేసుకొని బాధితులకు మెరుగైన సేవలందించాలన్నారు. వైజాగ్ గట్ క్లబ్ అసోసియేషన్, కొలిటిస్ అండ్ క్రోన్స్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా, ఆంధ్ర వైద్య కళాశాల(ఏఎంసీ) ఉదరకోశ వ్యాధుల వైద్య విభాగం సంయుక్తంగా ఏర్పాటు చేసిన జాతీయ సదస్సుకు దేశ నలుమూలల నుంచి 600 మంది వైద్య ప్రముఖులు, ఏడు దేశాలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. డాక్టర్ క్లాడియో ఫియోచి(అమెరికా) మాట్లాడుతూ పేగు పూత వ్యాధికి దారి తీసే కారణాలను వివరించారు. డైటీషియన్ మైత్రేయి రామన్(అమెరికా) ఆహార నియమాలను వెల్లడించారు. ఉదరకోశ వ్యాధుల వైద్య నిపుణులు డాక్టర్ ఇ.పెదవీర్రాజు, ఏవీ శివప్రసాద్, రాకేష్ కొచ్చార్, అజయ్‌కుమార్, అజిత్‌సూద్, వినీత్ అహుజ, సైమన్ ట్రావిస్, కేజీహెచ్ పర్యవేక్షక వైద్యాధికారి డాక్టర్ పి.శివానంద, ఏఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, డాక్టర్ కె.శిల్ప, సదస్సు కార్యనిర్వాహక కమిటీ ఛైర్మన్ డాక్టర్ ఎల్ఆర్ఎస్ గిరినాథ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ ఆచంట చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

కొరాపుట్-అరకు సెక్షన్‌లో తనిఖీలు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: తూర్పు కోస్తా రైల్వే వాల్తేర్ డీఆర్ఎం సౌరబ్ ప్రసాద్ శుక్రవారం భద్రతా తనిఖీలు నిర్వహించారు. భద్రత, సిగ్నల్ అండ్ టెలికాం, మెకానికల్, ఎలక్ట్రికల్, ట్రాక్షన్ డిస్ట్రిబ్యూషన్, ఆపరేషన్ విభాగాలకు సంబంధించిన సీనియర్ అధికారులతో కలిసి సెక్షన్‌లో పర్యటించిన ఆయన పలు భద్రతా పరమైన అంశాలపై ఆరా తీశారు. కొరాపుట్ రైల్వేస్టేషన్‌ను పరిశీలించిన ఆయన యార్డు, యాక్సిడెంట్ రిలీఫ్ రైలు, యాక్సిడెంట్ రిలీఫ్ మెడికల్ అండ్ ఇంజినీరింగ్ సామగ్రితో పాటు భద్రతా సామగ్రిని కూడా తనిఖీ చేశారు. క్రూ లాబీ రన్నింగ్ రూమ్‌లను పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. సెక్షన్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి, సర్క్యులేటింగ్ ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న భవనాల స్థితిగతులను తెలుసుకున్నారు. ఈ క్రమంలో రాయగడ తదితర స్టేషన్లను కూడా పరిశీలించి, విండో ట్రైలింగ్ తనిఖీలు నిర్వహించారు.

సినిమాలు

చిట్టివలస(తగరపువలస), న్యూస్‌టుడే

గణేశ్ - సత్యం సుందరం
రామలక్ష్మి - దేవర
తాత - దక్షిణ, సప్తగిరి- స్వాగ్
వెంకటరాజ్ (ఆనందపురం) - దేవర

శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు

కొమ్మాది, న్యూస్‌టుడే: మధురవాడ శిల్పారామం(జాతర)లో దసరా ఉత్సవాలను పురస్కరించుకుని శని, ఆదివారాలతో పాటు ఈనెల 10 నుంచి 13వ తేదీ వరకు ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని పరిపాలనాధికారి టి.విశ్వనాథరెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా శనివారం సాయంత్రం నగరానికి చెందిన సిద్ధేంద్రయోగి నాట్యమండలి కళాకారులతో శాస్త్రీయ, జానపద నృత్య ప్రదర్శనలు ఉంటాయన్నారు.

భీమిలి

ఎండాడ, న్యూస్‌టుడే

సమస్య: రుషికొండ ప్రభుత్వ పాఠశాల పరిసరాల్లోని 201/బీ/6/5 నంబరు గల వీధి దీపం వెలగక నిత్యం అంధకారం నెలకొంటోంది.
– స్థానికుడు, రుషికొండ

సమాధానం: వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. –సురేష్, విద్యుత్ ఏఈ

సమస్య: బీచ్‌రోడ్డు(రుషికొండ) కూడలిలో సిగ్నల్ వ్యవస్థ లేకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. – రామారావు వీర్రాజు, ఎండాడ

సమాధానం: ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తాం.
– పీఎంపాలెం, ట్రాఫిక్ పోలీసులు

మేమున్నాం.. మీకు తోడుగా
80086 11711, 99122 22247
సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

సమస్య: రుషికొండ ప్రభుత్వ పాఠశాల పరిసరాల్లో రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు పెరిగి విష పురుగులకు ఆవాసంగా మారింది.
– స్థానికులు, రుషికొండ

సమాధానం: పిచ్చిమొక్కలు తొలగించి శుభ్రత పనులు చేపడతాం.
– రవి, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్

అమ్మో.. కేజీబీవీ రోడ్డు

రాకపోకలకు నిత్యం ఇక్కట్లు..

భీమునిపట్నం, న్యూస్‌టుడే

భీమిలి గొల్లలపాలెం నుంచి కేజీబీవీ (కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం) మీదుగా నేరెళ్లవలస కాలనీ ఆర్టీకే గృహ సముదాయానికి వెళ్లే రోడ్డు రాళ్లు తేలి ప్రయాణికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భీమిలి పొరతోట రోడ్డు నుంచి గొల్లలపాలెం మీదుగా ఆర్టీకే వెళ్లేందుకు దగ్గర దారి కోసం గతంలో సొమ్మగిరి కొండను తొలిచి కిలోమీటరు మేర తారురోడ్డు నిర్మించారు. ఈ మార్గాన్ని నిత్యం అనేకమంది వినియోగిస్తారు. వైకాపా ప్రభుత్వ హయాంలో ఇక్కడున్న కొండల నుంచి కొంతమంది అక్రమంగా గ్రావెల్ తవ్వేసి రాత్రివేళ తరలించారు. లారీల రాకపోకల వల్ల ఈ రోడ్డు అధ్వానంగా తయారైంది. ప్రస్తుతం ఈ రహదారిపై ప్రయాణించే వాహన చోదకులు సర్కస్ చేయాల్సిన దుస్థితి. ఇలాంటి సమయంలో పలుమార్లు ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోక పోవడంతో స్థానికులు గగ్గోలు పెడుతున్నారు.



గతుకులమయంగా ఉన్న భీమిలి కస్తూర్బా పాఠశాల రహదారి దుస్థితి

మూణ్నాళ్ల ముచ్చటగా తాత్కాలిక రహదారి

ఇటీవల రాష్ట్ర విద్యాశాఖామంత్రి నారా లోకేశ్ కేజీబీవీ పాఠశాలను సందర్శించే సమయంలో జీవీఎంసీ అధికారులు గోతులమయంగా ఉన్న ఈ రోడ్డును క్రషర్ బుగ్గితో తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టి చదును చేశారు. హడావుడిగా ఈ పనులు చేపట్టినందుకు తర్వాత కురిసిన వర్షాలకు మట్టి కొట్టుకుపోయి మళ్లీ పూర్వస్థితికి వచ్చి వాహన చోదకులకు కష్టాలు పునరావృతమయ్యాయి.

ఎంతోమందికి ఈ మార్గమే శరణ్యం

★ నేరెళ్లవలస కాలనీలో రాజీవ్‌గృహకల్ప(ఆర్టీకే) ఇళ్ల సముదాయానికి వెళ్లేందుకు ఈ మార్గాన్ని ఉపయోగిస్తారు.
★ పురాతన ఉగ్ర నరసింహస్వామి, పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయాలకు భక్తులు ఈ మార్గంలోనే వెళుతుంటారు
★ కేజీబీవీకి ప్రతీరోజు వచ్చి వెళ్లే ఉపాధ్యాయినులు, విద్యార్థినుల తల్లిదండ్రులకు ఈ రోడ్డే శరణ్యం
★ నేరెళ్లవలస కాలనీలో వెలసిన ప్రయివేటు లేఅవుట్లకు వెళ్లేందుకు దీనిని ప్రధాన మార్గంగా పరిగణిస్తారు
★ ఈ మార్గం వెంబడి గతంలో వీఎంఆర్‌డీఏ వేసిన లేఅవుట్‌కు ప్లాట్ల యజమానులు తరచూ వచ్చి వెళుతుంటారు
★ ఈ ప్రాంతానికి ఏర్పడిన ప్రాధాన్యం దృష్ట్యా ఇక్కడున్న కొండవాలులో జీవీఎంసీ తరపున సామాజిక భవనం సైతం నిర్మిస్తున్నారు.

పటిష్ఠంగా నిర్మిస్తేనే సమస్యకు పరిష్కారం

భీమిలి పరిధిలో క్రమేపీ కీలకమైన రోడ్డుగా మారుతున్న కేజీబీవీ మార్గాన్ని విశాలమైన తారురోడ్డుగా తీర్చిదిద్దాల్సిన ఆవశ్యకత ఉందని పలువురు పేర్కొంటున్నారు. మూడేళ్ల క్రితం అప్పటి వైకాపా ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఇక్కడి కేజీబీవీ జూనియర్ కళాశాల ప్రారంభానికి విచ్చేసిన సమయంలో రోడ్డు సమస్య గురించి స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. త్వరలో ఈ రహదారి నిర్మాణానికి నిధులు కేటాయిస్తామని అప్పట్లో ప్రకటించినా తర్వాత అతీగతీ లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రంలో గోతులమయంగా తయారైన రోడ్లను అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో జీవీఎంసీ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఈ రోడ్డును వాహనాల రాకపోకలకు అనువుగా తీర్చిదిద్దాలని స్థానికులు కోరుతున్నారు.

రైతులకు ఉత్తమ సేవలందించాలి

పద్మనాభం, న్యూస్‌టుడే: రైతులకు సులభతరమైన ఉత్తమ సేవలందించాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. పద్మనాభంలో జిల్లా కో-ఆపరేటివ్ (డి.సి.సి.బి) బ్యాంకు శాఖను శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించి ప్రసంగించారు. జేసీ కె.మయూర్ అశోక్, డీసీవో ప్రవీణ, బ్యాంకు సీఈవో డి.వి.ఎస్.వర్మ, డిప్యూటీ రిజిస్ట్రార్ దుర్గాప్రసాద్, బ్యాంకు మేనేజర్ బి.వెంకట అప్పారావు, మండల తెదేపా అధ్యక్షుడు కోరాడ రమణ తదితర నాయకులు పాల్గొన్నారు. ★ అంతకుముందు రెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో స్వాతంత్ర్య సమరయోధుడు కశిరెడ్డి పాపయ్య విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం అనంతుని గిరిపైకి నిర్మిస్తున్న ఘాట్ రోడ్డు పనులను, ఆలయ మరమ్మతులను పరిశీలించారు. అనంతుని దీపోత్సవం నాటికి పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కె.రమణ, కె.దామోదరరావు, కె.లీలావతి, కె.నగేష్‌కుమార్, ఎం.నందీశ్వరరావు, గెద్ద ప్రసాద్, గొర్రెపాటి ఎర్రిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి: ఈ సందర్భంగా పద్మనాభం పంచాయతీ ఇసకలపాలెం ప్రాథమిక పాఠశాల నుంచి బదిలీ అయిన ఉపాధ్యాయుడిని తిరిగి ఇదే పాఠశాలలో నియమించాలని కోరుతూ పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్ హంస జ్యోతి ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు.

సేవలకు గుర్తింపు: మన టి.డి.పి యాప్ ద్వారా గడచిన అయిదేళ్లు సమర్థవంతంగా సేవలందించిన పద్మనాభం మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన చలపాక అమ్మన్నచారిని అభినందిస్తూ తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పంపిన అభినందన పత్రాన్ని ఎమ్మెల్యే శుక్రవారం ఆయనకు అందజేశారు.



బ్యాంకు శాఖను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంటా, చిత్రంలో జేసీ మయూర్ అశోక్ తదితరులు

విశాఖ సీసీఎఫ్‌గా మహ్మద్ దివాన్ మైదీన్

న్యూస్‌టుడే, పెదవాల్తేరు: విశాఖపట్నం జిల్లా అటవీశాఖ ముఖ్య అటవీ సంరక్షణాధికారి (సీసీఎఫ్)గా మహ్మద్ దివాన్ మైదీన్‌ను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో పనిచేసిన శ్రీకంఠనాథరెడ్డిని సాధారణ పరిపాలనశాఖకు రిపోర్టు చేయాలని ఆదేశించింది. అలాగే ఇందిరాగాంధీ జంతుప్రదర్శనశాల క్యూరేటర్ నందినీ సలారియాను ఇక్కడి నుంచి ఏపీ ఎంఎస్‌ఎంఈ విభాగానికి సీఈవోగా బదిలీ చేశారు. ఆమె స్థానంలో కొత్తవారిని నియమించాల్సి ఉంది. అలాగే అనకాపల్లి జిల్లా డీఎఫ్‌ఓ జగన్నాథసింగ్, రంపచోడవరం డీఎఫ్‌వో నరేంద్రన్‌లను బదిలీ చేసింది. పాడేరు డీఎఫ్‌వోగా వెంకట సందీప్ రెడ్డి, రంపచోడవరం డీఎఫ్‌వోగా రవీంద్ర ధర్మాలను ప్రభుత్వం నియమించింది.

దివ్యాంగునికి వితరణ

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి బోయివీధికి చెందిన దివ్యాంగుడు బెల్లాన ఆనంద్‌కు దాత కనికల లక్ష్మి తోడ్పాటుతో శుక్రవారం ట్రైసైకిల్ పంపిణీ చేశారు. ప్రమాదంలో కుడికాలు పోగొట్టుకుని మంచాన పడ్డ ఆనంద్‌కు ప్రభుత్వ పరంగా రావాల్సిన ప్రోత్సాహకాలు అందేలా సహకరిస్తామని తెదేపా రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. ఈ సందర్భంగా దాతను అభినందించారు. నాయకులు కె.అప్పన్న, కె.నాగరాజు, జి.పోలిరాజు తదితరులు పాల్గొన్నారు.

అ వీ ఇ వీ

ఆర్టీసీ బస్‌పాస్ కౌంటర్లకు అంతరాయం

అడివివరం (సింహాచలం), న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్‌పాసుల కోసం అందుబాటులో ఉన్న వెబ్‌సైట్ ఆధునికీకరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఈనెల 5, 6 తేదీల్లో బస్‌పాస్ కౌంటర్ల సేవలకు అంతరాయం కలుగుతుందని సింహాచలం డిపో మేనేజర్ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. వెబ్‌సైట్ ఆధునికీకరణ అనంతరం 7వ తేదీ నుంచి యథావిధిగా కౌంటర్లు అందుబాటులోకి వస్తాయని తెలియజేశారు. ప్రయాణికులు, విద్యార్థులు సహకరించాలని కోరారు.

వార్డు సమస్యలపై కమిషనర్‌కు వినతి

మధురవాడ, న్యూస్‌టుడే: జీవీఎంసీ ఏడో వార్డులో ప్రాంతాల వారీగా నెలకొన్న పలు అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయాలని కమిషనర్ పి.సంపత్‌కుమార్‌కు కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ శుక్రవారం వినతిపత్రం అందించారు. చంద్రంపాలెం, నగరంపాలెం, మల్లయ్యపాలెం, వాంబే కాలనీల్లోని శ్మశానవాటికలు అభివృద్ధి చేయాలని, ప్రజారోగ్య విభాగంలో సిబ్బంది సంఖ్యను పెంచాలని కోరారు. పలు కాలనీల్లోని రోడ్లు, పార్కులను అభివృద్ధి చేయాలని విన్నవించారు. జాతీయరహదారి పక్కన స్టేడియం ఎదురుగా సేవా మార్గంలో ఎస్ఎఫ్‌సీ నుంచి కారుషెడ్డు మీదుగా మధురవాడ ఈపీడీసీఎల్ విద్యుత్తు కార్యాలయం వరకు ప్రధాన కాలువలో పూడికలు తొలగించాలన్నారు. ఆయా సమస్యలపై కమిషనర్ సానుకూలంగా స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు కార్పొరేటర్ తెలిపారు.

మర్యాదపూర్వక కలయిక

తగరపువలస, న్యూస్‌టుడే: భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును విద్యుత్తు శాఖ జోన్-3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు, ఇతర ఉన్నతాధికారులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీఈ కిరణ్‌కుమార్, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

తగరపువలస, న్యూస్‌టుడే: చిట్టివలస హైస్కూలు రోడ్డులోని తగరపువలస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులు తెలిపారు. బీఎస్సీ గణితం, బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ, బీకాం కంప్యూటర్స్, బీఏ హిస్టరీలో సీట్లు భర్తీ చేయనున్నామన్నారు. మరిన్ని వివరాలకు 89788 83125, 85229 75829 నంబర్లను ఫోనులో సంప్రదించాలని కోరారు.

రోగులకు ఉచిత వైద్యసాయం

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి యంగ్‌మెన్ క్రిస్టియన్ అసోసియేషన్(వైఎంసీఏ) ఆధ్వర్యంలో స్థానిక ఆంధ్రాబాప్టిస్ట్(ఏబీ) చర్చి ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన వైద్య శిబిరంలో 120 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రారంభించి ప్రసంగించారు. పేదల కోసం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందించారు. భీమిలి వైఎంసీఏ అధ్యక్షుడు కె.ఎస్.ఎం.సుధాకర్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో రీజియన్ వైఎంసీఏ ఛైర్మన్ రోనాల్డ్ విలియమ్స్ తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

పీఎంపాలెం, న్యూస్‌టుడే: మధురవాడ ప్రాంతాల్లో మద్యం తాగి వాహనాలు నడిపిన 16 మందిపై కేసులు నమోదు చేయగా వారికి ఆబ్కారీ విభాగం ప్రత్యేక న్యాయస్థానం జరిమానా విధించినట్లు పీఎంపాలెం ట్రాఫిక్ పోలీసుస్టేషన్ ఎస్సై ప్రసాద్ తెలిపారు. నిందితులు ఒక్కొక్కరికి రూ.10 వేల నుంచి రూ.12 వేల మధ్య అపరాధరుసుం చెల్లించాలని న్యాయమూర్తి తీర్పునిచ్చారన్నారు. వీరిలో నలుగురు వ్యక్తులకు మూడు రోజుల సాధారణ కారాగార శిక్ష, ఒక్కొక్కరికి రూ.50 అపరాధ రుసుం విధించారన్నారు.

వైభవంగా సహస్రనామార్చన

సింహాచలం, న్యూస్‌టుడే: సిరులొలికే సింహాద్రి నాథుడికి శుక్రవారం సహస్రనామార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు వేకువ జామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన, బాలభోగం సేవలు జరిపారు. శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. తులసీదళాలతో దేవతామూర్తులకు సహస్రనామార్చన జరిపారు. అనంతరం అదే వేదికపై స్వామి, అమ్మవార్ల నిత్య కల్యాణోత్సవాన్ని కనులపండువగా జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని సేవించారు. అర్చకులు భక్తులను వేదమంత్రాలతో ఆశీర్వదించి కల్యాణ తలంబ్రాలు, శేషవస్త్రాలు అందజేశారు.



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

సింహగిరిపై దసరా వేడుకలు

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాచలం దేవస్థానం సంస్కృతోన్నత పాఠశాల ఆధ్వర్యంలో శుక్రవారం సింహగిరిపై కళావేదిక వద్ద దసరా సంబరాలు ఘనంగా జరిగాయి. ప్రధానోపాధ్యాయిని భాను ఆధ్వర్యంలో విద్యార్థులు జానపద నృత్యాలు, పులివేషాలతో అలరించారు. దేవస్థానం ఈవో వేంద్ర త్రినాథరావు విద్యార్థులకు స్వామివారి ప్రసాదం, జ్ఞాపిక అందజేసి అభినందించారు. ఏదయా మీదయా.. అంటూ విద్యార్థులు ఆలపించిన అలనాటి దసరా పాట పాత రోజులను గుర్తు చేసింది. ఈ కార్యక్రమంలో ఏఈవోలు ఎన్.ఆనంద్‌కుమార్, రమణమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అలరించిన విద్యార్థినుల నృత్య ప్రదర్శన

మండల స్థాయిలో కోలాటం పోటీలు

పీఎంపాలెం, న్యూస్‌టుడే: గ్రామీణ సంస్కృతి సంప్రదాయాలను ప్రోత్సహించేందుకు భీమిలి, పద్మనాభం, ఆనందపురం మండలాల్లో గంటా నారాయణమ్మ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కోలాటం పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దసరా ఉత్సవాలను పురస్కరించుకుని మండల స్థాయిలో జరగనున్న ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా ఎంపీడీవో, తహసీల్దార్‌లు వ్యవహరిస్తారన్నారు. ఒక్కో మండలానికి ఒక్కో జూనియర్, సీనియర్ బృందాలను ఎంపిక చేస్తారన్నారు. ఈ నెల 12వ తేదీ విజయదశమి రోజున భీమిలిలోని గంటా శ్రీనివాసరావు క్యాంపు కార్యాలయం వద్ద ఫైనల్ పోటీలు నిర్వహించి విజేతలను నిర్ణయిస్తామన్నారు. గెలుపొందిన జూనియర్, సీనియర్ బృందాలకు మొదటి బహుమతి రూ.50,116, రెండో బహుమతి రూ.25,116, మూడో బహుమతి రూ.15,116 ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చేతుల మీదుగా అందజేస్తారన్నారు. పోటీలకు ఆసక్తి కలిగిన వారు ఆయా మండలాల్లో ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో సంప్రదించాలన్నారు.

కాలిబాటల ఆక్రమణ తగదు

తగరపువలస, న్యూస్‌టుడే: తగరపువలస, చిట్టివలసల్లోని ప్రధానరోడ్లపై కాలిబాటలు, రోడ్డు మార్జిన్లను ఆక్రమించడం వల్ల ఎదురవుతున్న సమస్యలపై జీవీఎంసీ భీమిలిజోన్ పట్టణ ప్రణాళికా విభాగం, విశాఖ సిటీ భీమునిపట్నం ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. జోన్-1 భీమిలి కమిషనరు పి.ప్రేమ ప్రసన్నవాణి మాట్లాడుతూ కాలిబాటలను ఆక్రమించి వ్యాపారాలు చేపట్టి వాహనాల రాకపోకలకు ఆటంకం కల్పించరాదన్నారు. తగరపువలస రోడ్లపై ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ఫుట్‌పాత్ వ్యాపారులను, ప్రజలను చైతన్యవంతులను చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సహాయ పట్టణ ప్రణాళికాధికారి డి.శ్రీనివాస్, ట్రాఫిక్ ఎస్ఐ చిరంజీవి, సచివాలయ సిబ్బంది, సీవోలు, ఆర్‌పీలు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీలో జీవీఎంసీ, పోలీసు అధికారులు, సిబ్బంది

గాయత్రీ.. సర్వసిద్ధి ప్రదాయిని



విజినిగిరిపాలెంలో..



అడివివరం ఎస్‌వీఎల్ఎన్ యూత్ ఆధ్వర్యంలో..



గీతం వైద్య కళాశాల ప్రాంగణంలో..



భీమిలి సాగర తిరుమల క్షేత్రంలో..



పీఎంపాలెం హెచ్‌పీసీఎల్ లేఅవుట్ లలితా పరమేశ్వరి ధ్యానపీఠంలో..



ఎండాడ దుర్గాదేవి ఆలయంలో...



తాటితూరులో..

నియోజకవర్గంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం రెండవ రోజు జగన్మాత గాయత్రీదేవి అవతారంలో భక్తుల పూజలందుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాల్లో, పూజా మండపాల్లో ఉత్సవ మూర్తుల్ని ప్రత్యేకంగా అలంకరించి వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, సింహాచలం, మధురవాడ, పీఎంపాలెం, కొమ్మాది, భీమునిపట్నం, ఎండాడ, సాగర్‌నగర్, ఆనందపురం, తగరపువలస



చంద్రంపాలెం జాతరగట్టు దుర్గాలమ్మ ఆలయంలో..



జీరుపేటలో..



తాటితూరు శాలివాహన సంఘం ఆధ్వర్యంలో..



టైలర్స్ కాలనీలో..



సంగివలసలో..




మెట్టమీదపాలెంలో..



కారుషెడ్డు కూడలి బబ్బేలమ్మ ఆలయంలో..



గోశాల లేఅవుట్‌లో..



కృష్ణంరాజుపేటలో..

ప్రభుత్వ భూమి కబ్జా

గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: కాపులుప్పాడ రెవెన్యూ పరిధి చిన మంగమారిపేటలోని రూ.25 లక్షల విలువైన ప్రభుత్వ స్థలం కబ్జాకు గురైంది. ఇక్కడి కొండవాలులోని దాదాపు అయిదు సెంట్ల భూమిని కబ్జా చేసి ఇంటి నిర్మాణ పనుల కోసం పునాదులు తవ్వారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక యువకులు అడ్డుకునే ప్రయత్నం చేసినా అక్రమ నిర్మాణం ఆగలేదు. రెవెన్యూ వర్గాలు స్పందించి ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలని పలువురు కోరుతున్నారు.



చిన మంగమారిపేటలో కబ్జాకు గురైన స్థలం

తిమ్మాపురంలో సీఆర్‌జెడ్‌కి తూట్లు

గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: భీమిలి బీచ్‌రోడ్డులోని గొల్లల తిమ్మాపురం బీచ్‌కి సమీపంలో సీఆర్‌జెడ్ నిబంధనలను ఉల్లంఘించి నిర్మాణాలు జరుగుతున్నాయి. సముద్రానికి సమీపంలో బీచ్‌రోడ్డు కింది వైపు భారీ శాశ్వత కట్టడాలు జరుగుతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడం లేదని స్థానికులు అంటున్నారు. ఈ ప్రాంతంలో నిర్మాణం చేపట్టాలంటే జీవీఎంసీ నుంచి నిర్మాణానికి అనుమతులతో పాటు సీఆర్‌జెడ్ అనుమతులు కూడా తప్పనిసరిగా ఉండాలి. అయితే ఎలాంటి అనుమతులు లేకున్నా ఇక్కడ దర్జాగా నిర్మించేస్తున్నారు. జీవీఎంసీ, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

సమస్యల వలయంలో ముకుందపురం

దర్పణం

ఆనందపురం, న్యూస్‌టుడే: ఆనందపురం మండలం ముకుందపురం పంచాయతీలో గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పేరిట ఊరిలోకి ఎమ్మెల్యే వచ్చినపుడు తప్ప.. ఎలాంటి పనులు చేయలేదని గ్రామస్థులు చెబుతున్నారు. గ్రామంలోని ఏ వీధికి వెళ్లినా మురుగునీటి కాలువలు లేవని, రోడ్లు అధ్వానంగా ఉన్నాయని స్థానికులు వాపోతున్నారు.

★ గతంలో చంద్రన్న బాట ద్వారా.. జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో వేసిన సిమెంట్ రోడ్లు, కాలువలు తప్ప.. కొత్తగా వేసిన రోడ్లు లేవు. పాత కాలనీ కావడంతో వర్షాల సమయంలో నీరు ఇళ్లలోకి వస్తోందని కాలనీలోని స్థానికులు వాపోతున్నారు. పంచాయతీ పాలకవర్గం ఉన్నా గ్రామ సచివాలయ వ్యవస్థలో తమది శివారు గ్రామం కావడంతో ఇక్కడి సమస్యలు చెప్పుకొందామంటే అధికారులే అందుబాటులో లేని పరిస్థితి నెలకొందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మురుగునీటి కాలువలు, సిమెంట్ రోడ్ల సదుపాయం కల్పించాలని కోరుతున్నారు.



బీసీ కాలనీలో మురుగునీటి కాలువలు లేక ఇలా..

కాలం చెల్లిన వాహనాలు..

ఖాకీలకు తప్పని అవస్థలు

గంజాయి నిందితులను పట్టుకోవడంలో ఇబ్బందులు

పీఎంపాలెం, న్యూస్‌టుడే: నేరాలకు పాల్పడుతున్న దొంగలను పట్టుకోవడంలో పోలీసులు చూపిస్తున్న ఉత్సాహానికి వారి వాహనాలే బ్రేకులు వేస్తున్నాయి. పీఎంపాలెం పోలీసు స్టేషన్ పరిధిలో తరచూ పదుల సంఖ్యలో కేసులు నమోదవుతున్నాయి. చాలా వరకు కేసుల్లో నిందితులను పట్టుకోవడానికి పోలీసులు బృందాలుగా నగరంతో పాటు దూర ప్రాంతాలకు సైతం వెళ్లాల్సి వస్తుంది. ఒక్కో సమయంలో వారిని వాహనంతో వెంబడించి పట్టుకోవాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా గంజాయి నిందితుల విషయంలో ఈ సమస్య తీవ్రంగా ఉంటోంది. ఎంతో ప్రాధాన్యం కల్గిన ఈ స్టేషన్‌లో రెండు జీపులు మాత్రమే వాడుకలో ఉన్నాయి. ఒకటి సీఐ వినియోగంలో ఉంటే, మరొకటి స్టేషన్‌లో కేసుల ఛేదనకు ఉపయోగిస్తున్నారు. నలుగురు ఎస్సైలు కల్గిన ఈ స్టేషన్‌లో ఏవైనా కేసుల విషయంలో సిబ్బందితో కలిసి బయటకు వెళ్లాల్సి వస్తే ఒక్కరికి మాత్రమే జీపుపై వెళ్లే అవకాశం ఉంటోంది. ఈ క్రమంలో మహిళా ఎస్సైకి ప్రాధాన్యం కల్పించి మిగిలిన వారు ద్విచక్రవాహనాలను ఆశ్రయిస్తున్నారు. ఉన్న రెండు జీపులకు కాలం చెల్లడంతో తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. దీంతో సంబంధిత వాహనాల్లో ప్రయాణమంటేనే పోలీసు అధికారులను ఆందోళనకు గురి చేస్తోంది. విధుల్లో భాగంగా వారు ఆయా వాహనాల్లో వెళ్తున్నప్పుడు ఒక్కోసారి నడిరోడ్డుపై అవి హఠాత్తుగా ఆగిపోతున్నాయి. ఆ సమయంలో వారి బాధలు వర్ణనాతీతం. ఒక్కో జీపునకు వారంలో నాలుగుసార్లు మరమ్మతులు చేయిస్తే తప్ప ముందుకు కదలలేని పరిస్థితి. దాంతో వారు వేర్వేరు వాహనాలను ఆశ్రయించి గమ్యస్థానాలకు చేరుకోవాల్సి వస్తోంది. అలాగే ద్విచక్రవాహనాల విషయంలో కూడా ఇలాంటి సమస్యలే ఉన్నాయి. కేసుల సంఖ్య ఎక్కువగా ఉన్న పీఎంపాలెం స్టేషన్ ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని ఉన్నతాధికారులు స్పందించి అన్ని విధాలా పక్కాగా ఉన్న వాహనాలను అందిస్తే బాగుంటుందని మధురవాడ ప్రాంతీయులు కోరుతున్నారు.



ఇటీవల ఓ మార్గంలో మొరాయించి నిలిచిపోయిన వాహనం

విశాఖ తూర్పు

విశాఖ సీసీఎఫ్‌గా మహ్మద్ దివాన్ మైదీన్

న్యూస్‌టుడే, పెదవాల్తేరు: విశాఖపట్నం జిల్లా అటవీశాఖ ముఖ్య అటవీ సంరక్షణాధికారి (సీసీఎఫ్)గా మహ్మద్ దివాన్ మైదీన్‌ను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో పనిచేసిన శ్రీకంఠనాథరెడ్డిని సాధారణ పరిపాలనశాఖకు రిపోర్టు చేయాలని ఆదేశించింది. అలాగే ఇందిరాగాంధీ జంతుప్రదర్శనశాల క్యూరేటర్ నందినీ సలారియాను ఇక్కడి నుంచి ఏపీ ఎంఎస్ఎంఈ విభాగానికి సీఈవోగా బదిలీ చేశారు. ఆమె స్థానంలో కొత్తవారిని నియమించాల్సి ఉంది. అలాగే అనకాపల్లి జిల్లా డీఎఫ్ఓ జగన్నాథసింగ్, రంపచోడవరం డీఎఫ్‌వో నరేంద్రన్‌లను బదిలీ చేసింది. పాడేరు డీఎఫ్‌వోగా వెంకట సందీప్ రెడ్డి, రంపచోడవరం డీఎఫ్‌వోగా రవీంద్ర ధర్మాలను ప్రభుత్వం నియమించింది.

సమస్య: ఎంవీపీకాలనీ సెక్టారు-3 రైతుబజారు రోడ్డులోని చెత్త సేకరించే వాహనం రావటం లేదు. - షరీన్

సమాధానం: పరిశీలించి వాహనం ద్వారా వ్యర్థాల సేకరణ చేపడతాం. - సూరిబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

అ వీ ఇ వీ

■ జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక

ఆరిలోవ, న్యూస్‌టుడే: శ్రీకృష్ణాపురంలోని డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల ప్రిన్సిపల్ వి.రత్నవల్లి తెలిపారు. మొత్తం 36 మంది విద్యార్థులు జిల్లా పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఇందుకు తగ్గట్టుగా విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో వాలీబాల్, బ్యాడ్మింటన్‌లలో శిక్షణ ఇస్తామని పి.ఇ టి వివేకానంద వెల్లడించారు.

■ 7న డిగ్రీ మిగులు సీట్లకు స్పాట్ అడ్మిషన్లు

హెచ్‌బికాలనీ, (మద్దిలపాలెం), న్యూస్‌టుడే: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పలు కోర్సుల్లోని మిగులు సీట్లకు ఈనెల 7 నుంచి 9వ తేదీ వరకు స్పాట్ అడ్మిషన్లు చేపడుతున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ ఐ.విజయబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఒరిజనల్ ధ్రువపత్రాలతో వచ్చి ప్రవేశాలు పొందవచ్చునని పేర్కొన్నారు.

■ 7న వృద్ధులకు పరికరాలు పంపిణీ

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: వయోజనులకు అవసరమైన పరికరాలు అందించడానికి ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతులు వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జె.మాధవి తెలిపారు. రాష్ట్ర వయోశ్రీ యోజన పథకం ద్వారా ఆలింకో సహకారంతో 7న సిరిపురం గురజాడ కళాక్షేత్రంలో అర్హులైన వృద్ధులకు పరికరాలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. మార్చి నెలలో జిల్లా వ్యాప్తంగా వివిధ శిబిరాలు నిర్వహించి 817 మందిని అర్హులుగా గుర్తించినట్లు చెప్పారు. ఇందులో వినికిడి పరికరాలు, చెంకక్రలు, నీక్యాప్స్, బెల్ట్‌లు, కమోడిటీ ఛైర్లతో పాటు వివిధ పరికరాలు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

■ మందుబాబులకు జరిమానా

పీఎంపాలెం: మధురవాడ ప్రాంతాల్లో మద్యం తాగి వాహనాలు నడిపిన 16 మందిపై కేసులు నమోదు చేయగా వారికి ఆబ్కారీ విభాగం ప్రత్యేక న్యాయస్థానం జరిమానా విధించినట్లు పీఎంపాలెం ట్రాఫిక్ ఎస్సై ప్రసాద్ తెలిపారు. నిందితులు ఒక్కొక్కరికి రూ.10 వేల నుంచి రూ.12 వేల మధ్య అపరాధరుసుం చెల్లించాలని న్యాయమూర్తి తీర్పునిచ్చారన్నారు. వీరిలో నలుగురు వ్యక్తులకు మూడు రోజుల సాధారణ కారాగార శిక్ష, ఒక్కొక్కరికి రూ.50 అపరాధ రుసుం విధించారన్నారు.

పట్టణ ప్రణాళిక ప్రక్షాళన ఇంకెప్పుడో..!


జోన్-3 కార్యాలయం

న్యూస్‌టుడే, ఎంవీపీకాలనీ

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు దాటినా జీవీఎంసీ జోన్-3 పట్టణ ప్రణాళిక విభాగంలో మాత్రం ప్రక్షాళన జరగలేదు. అన్ని ముఖ్య విభాగాల అధికారులు మారినా ఇక్కడ మాత్రం పాత వారే కొనసాగుతున్నారు. నాటి వైకాపా నాయకులు చెప్పిందే వేదమన్నట్లు పని చేసిన వారు ఇంకా ఉండడంతో పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. వైకాపా నాయకుల ఆధ్వర్యంలో జరుగుతున్న.. అనుమతులు లేని నిర్మాణాలకు వీరంతా వత్తాసుపలకడంతో పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

వారికే వత్తాసుపలుకుతూ..

నగర నడిబొడ్డున ఉన్న జీవీఎంసీ జోన్-3.. ఆదాయం, వాణిజ్యపరంగా ఎంతో అభివృద్ధి చెందింది. అక్రమ నిర్మాణాలు, రహదారుల ఆక్రమణలు వైకాపా కార్పొరేటర్లు ఉన్న వార్డుల్లో విస్తృతంగా చోటుచేసుకున్నాయి. ప్రధానంగా 15, 16, 17, 20, 21, 23 వార్డుల్లో చిన్నచిన్న రహదారుల్లో పెద్దపెద్ద భవనాలు నిర్మించినా కనీసం పట్టించుకోవడం లేదు.


★ సచివాలయ కార్యదర్శులుగా వైకాపా నాయకుల కనుసన్నల్లోనే విధులు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా ఇంటి ముందు ఇసుక పడినా, భవన నిర్మాణ సామగ్రి కనిపించినా పట్టణ ప్రణాళిక కార్యదర్శులు ఆయా ఇళ్లకు వెళ్లి వైకాపా నాయకుల అనుమతులు తీసుకోవాలంటూ ఒత్తిడి తీసుకొస్తున్నారు. దీంతో చేసేది లేక వైకాపా నాయకుల చేతుల తడపాల్సి వస్తోందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

★ రహదారులకు ఇరువైపులా ఆక్రమించి బడ్డీలను ఏర్పాటు చేసిన వారి నుంచి రూ.లక్షల్లో వసూళ్లకు పాల్పడుతున్నట్లు పలువురు చెబుతున్నారు. అయితే వైకాపా నాయకులు చేపడుతున్న అనుమతులు లేని నిర్మాణాల వైపు మాత్రం కనీసం కన్నెత్తి చూడకుండా వారికి సహకరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నిబంధనలకు విరుద్ధమైనా..

★ ఇటీవల జోన్-3 ఏసీపీ, టీపీఎస్, ఇతర సిబ్బందికి బదిలీలు జరగ్గా.. వాటిని ఆపేందుకు ప్రస్తుత ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నారు. దీంతో కొత్త వారు వచ్చే వరకు ప్రక్షాళన జరిగేలా లేదు.

★ ఇటీవల కేఆర్ఎంకాలనీలో ఓ వైకాపా నాయకుడు నిబంధనలకు విరుద్ధంగా బహుళ భవన నిర్మాణం చేపడుతున్నా.. దానిపై కూటమి నాయకులు ఫిర్యాదు చేసినా పట్టణ ప్రణాళిక అధికారులు పట్టించుకోలేదని తెలుస్తోంది. దీంతో పాటు వెంకోజీపాలెం ప్రధాన రహదారిలో, ఎంవీపీకాలనీ, ఆదర్శనగర్, కేఆర్ఎంకాలనీ, మద్దిలపాలెం తదితర ప్రాంతాల్లో రహదారులను ఆక్రమించి బడ్డీలు ఏర్పాటు చేస్తున్నారు. అయినా తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్న తీరుపై పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జోన్-3ని పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాల్సిన అవసరముందని పలువురు అభిప్రాయపడుతున్నారు.


నిబంధనలకు విరుద్ధంగా కేఆర్ఎంకాలనీలో జరుగుతున్న నిర్మాణం

ఉన్నత భవితకు నైపుణ్యాలు అవసరం

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: ప్రస్తుత అవకాశాలను అందిపుచ్చుకోవటానికి సిద్ధంగా ఉండాలని, ఇందుకోసం నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ చెందిన ప్రవీణ్ కుమార్ అన్నారు. శుక్రవారం ఎంవీపీకాలనీ సమత కళాశాలలో నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో 'భవిష్యత్తు - అవకాశాలు' అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలను వివరించారు. విద్యార్థులను సందేహాలను నివృత్తి చేశారు. డీన్ ఆచార్య విజయరావు, డైరెక్టర్ శ్రీనివాసరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

6న మానవ హక్కులపై సదస్సు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: మానవ హక్కులపై ఈనెల 6న అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు మానవ హక్కుల కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంతి శ్యాంప్రసాద్ తెలిపారు. రామ్‌నగర్ మానవ హక్కుల కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాగార్జున యూనివర్సిటీ మాజీ వీసీ రాజేంద్రప్రసాద్ హాజరై ప్రసంగించనున్నారని తెలిపారు. విశాఖ బార్ అసోసియేషన్ అధ్యక్షులు బెవర సత్యనారాయణ పాల్గొంటారని పేర్కొన్నారు.

మండపాల నిర్వాహకులకు సూచనలు

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: నగరంలో దసరా పండగ పురస్కరించుకుని దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన మండపాల నిర్వాహకులతో పోలీసులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వీరికి పలు సూచనలు చేశారు. నిబంధనలు తప్పకుండా పాటించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో పండుగ జరపాలని పేర్కొన్నారు.


నిర్వాహకులకు సూచలిస్తున్న పోలీసు అధికారులు

అంతర్జాతీయ సదస్సు గోడపత్రిక ఆవిష్కరణ

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్రవిశ్వవిద్యాలయం తత్వశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 2025 జనవరి 24, 25, 26 తేదీల్లో జరగనున్న అంతర్జాతీయ సదస్సుకి సంబంధించిన గోడపత్రికను వీసీ ఆచార్య జి.శశిభూషణరావు శుక్రవారం తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. 'నాగరికతల మధ్య సంఘర్షణల పరిష్కారానికి తత్వశాస్త్రం, యోగా' అనే అంశంపై సదస్సు నిర్వహించనున్నారు. ఇందులో జాతీయ స్థాయిలో పరిశోధకులు తమ పరిశోధనా పత్రాలు సమర్పిస్తారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య ఎన్.కిశోర్‌బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ.నరసింహారావు, తత్వశాస్త్ర విభాగ అధిపతి ఆచార్య వానపల్లి వెంకటరావు, ఆచార్య కృష్ణయ్య, యోగా విభాగాధిపతి ఆచార్య కె.రమేష్‌బాబు, డాక్టర్ ముసుగు ప్రసాద్, అల్లాడి వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు తదితరులు

జాబ్ మేళాలో 83 మంది ఎంపిక

ఆటోమోటివ్ (మద్దిలపాలెం), న్యూస్‌టుడే: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం కళాశాల జేకేసీ, ఏపీ ఎస్ఎస్‌డీసీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాలో 83 మంది ఎంపికైనట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సి.హెచ్.సుబ్బిరెడ్డి తెలిపారు. ఇందులో మొత్తం 477 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధికారి చాముండేశ్వరరావు పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఉపాధి కల్పనాధికారి సి.హెచ్.సుబ్బిరెడ్డి

విద్యార్థులకు ఇంటర్న్‌షిప్

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి బాలికలకు సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో వృత్తి విద్యలో శుక్రవారం ఇంటర్న్‌షిప్ కార్యక్రమం చేపట్టారు. బాలికాభివృద్ధి అధికారిణి ఖలీషాబేగం, యుగశక్తి ఒకేషనల్ కో-ఆర్డినేటర్ రిషికేష్ పాల్గొని మాట్లాడారు. డిగ్రీ విద్యార్థులకు మాత్రమే ఉన్న ఇంటర్న్‌షిప్‌ను పాఠశాల స్థాయి నుంచే ప్రస్తుతం చేపట్టడం విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు, పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.


ఎంపికైన విద్యార్థులతో బాలికాభివృద్ధి అధికారిణి ఖలీషాబేగం

న్యాప్‌కిన్స్ కాల్చివేత పరికరం అందజేత

ఆరిలోవ, న్యూస్‌టుడే: కేంద్ర కారాగారంలో ఉన్న మహిళా ఖైదీల విభాగంలో శానిటరీ న్యాప్‌కిన్స్‌ని కాల్చివేసే యంత్ర పరికరాన్ని ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్ సభ్యులు శుక్రవారం కారాగారం పర్యవేక్షణాధికారి ఎస్ కిశోర్‌కుమార్ అనుమతితో నెలకొల్పి ప్రారంభించారు. దీని వల్ల మహిళా విభాగంలో పరిశుభ్రంగా ఉంటుందని, మహిళా ఖైదీలు ఆరోగ్య పరిరక్షణకు దోహదపడుతుందని సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్ సభ్యులు అరుణకుమారి, గీతా శ్రీకాంత్, రమా రాజ్‌గోపాల్, వాణి శ్రీనివాస్ కారాగారం ఉప పర్యవేక్షణాధికారి ఎస్.కమలాకర్, డిప్యూటీ జైలర్ ఎం.రాణి తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న ఫౌండేషన్ సభ్యులు, జైలు అధికారులు

ఆకట్టుకున్న ఫుడ్ ఫెస్టివల్

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: సిరిపురం బాలల ప్రాంగణంలో శుక్రవారం శ్రీకాశ్యప్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఫుడ్ ఫెస్టివల్ ఆహారోత్సవ్-2024 నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల వంటకాలను ఒకే వేదికపైకి తీసుకొచ్చారు. విద్యార్థులు వంటకాలకు సంబంధించిన వివిధ స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. సంస్థ కరస్పాండెంట్ టి.ఆర్.ఎస్.వర్మ, సిబ్బంది పాల్గొన్నారు.


స్టాల్స్ వద్ద విద్యార్థులు

అలరించిన నాటికలు

ఆటోమోటివ్, (మద్దిలపాలెం), న్యూస్‌టుడే: విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ (కళాభారతి) ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం 'నిన్ను నువ్వు తెలుసుకో', చూపులు కలవని శుభవేళ అను రెండు నాటికలను శ్రీ మాతృశ్రీ కళానికేతన్ నడుపూరు విశాఖపట్నం వారిచే కళాకారులు నాటికలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. చూపులు కలవని శుభవేళ నాటికలో జబర్దస్త్ సత్తిపండు సుబ్రహ్మణ్యం పాత్ర పోషించి ఆకట్టుకున్నాడు. రెండు నాటికలకు సత్తిపండు దర్శకత్వం వ్యవహరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు జీఆర్కే ప్రసాద్ (రాంబాబు), జబర్దస్త్ రాపేటి అప్పారావు పలువురు పాల్గొన్నారు.


జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించిన ముఖ్యులు

వైభవంగా సహస్రనామార్చన

సింహాచలం, న్యూస్‌టుడే: సిరులొలికే సింహాద్రినాథుడికి శుక్రవారం సహస్రనామార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు వేకువజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన, బాలభోగం సేవలు జరిపారు. శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. తులసీదళాలతో దేవతామూర్తులకు సహస్రనామార్చన జరిపారు.

తల్లిదండ్రులను మించిన దైవం లేదు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: ఎంత ఎత్తుకు ఎదిగినా తల్లిదండ్రులను మరవకూడదని, అప్పుడే జీవితానికి సార్థకత చేకూరుతుందని పద్మశ్రీ గ్రహీత గరికపాటి నరసింహారావు అన్నారు. సిరిపురం గురజాడ కళాక్షేత్రంలో శుక్రవారం సాయంత్రం రోటరీ క్లబ్ విశాఖట్నం ఆధ్వర్యంలో లోకకల్యాణార్థం దేవి వైభవం రెండో రోజు ప్రవచనాలు నిర్వహించారు. మనిషి పుట్టినప్పటి నుంచి ఎంతో మందిని కలుస్తారని తెలిపారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా ఉన్నవాళ్లు మాత్రమే మనతో కొనసాగుతారని అన్నారు. తల్లిదండ్రులకు మించిన దైవం లేదని అన్నారు. వైభవ వేంకటేశ్వర స్వామి ప్రధాన అర్చకులు శేషస్వామి, సింహాచలం దేవస్థానం అర్చకులు శ్రీనివాసాచార్యులు, రోటరీ క్లబ్ విశాఖ ఛైర్మన్ జగన్‌మోహన్, అధ్యక్షులు వినయ్‌గాంధీ తదితరులు పాల్గొన్నారు.



ప్రవచనాలు చెబుతున్న గరికపాటి నరసింహారావు

గాయత్రీ దేవిగా అమ్మవారి దర్శనం

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, ఎం.వి.పి.కాలనీ, ఆరిలోవ, విశాలాక్షినగర్, శివాజీపాలెం, పెదవాల్తేరు


ఎంవీపీ సెక్టారు-6లో గాయత్రీదేవి అలంకరణలో పార్వతీదేవి


వాల్తేరు కూడలిలో..


పాటలు పాడుతున్న గాయకులు


అమ్మవారికి పూజలు జరుపుతున్న సాయిసుధాకర పూర్ణానంద స్వామి


మంగాపురంకాలనీలో..


రామ్‌నగర్‌లో..


పెదగదిలిలో..



పాత డెయిరీఫారం కూడలిలో బాలా త్రిపురసుందరిగా..

ఈ రైతు ముగ్గురికి ప్రాణదాత

★ జీవన్మృతుడి అవయవాల దానం

★ గ్రీన్ ఛానల్‌లో విశాఖకు తరలింపు

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: ఆ రైతు తాను ఉన్నంత కాలం సాగు చేస్తూ పది మంది కడుపు నింపాడు. తాను లేకపోయినా మరో ముగ్గురికి ప్రాణదానం చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపాడు. వివరాల్లోకి వెళ్తే.. డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటకు చెందిన రెడ్డి కల్యాణ్ చక్రవర్తి(51) అనే రైతు రాజానగరం పరిధిలో ఈనెల 2న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం కాకినాడ అపోలో ఆసుపత్రికి తరలించారు. బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు నిర్ధారించారు. వైద్యుల సూచనలతో అతని తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు అవయవ దానం చేసేందుకు అంగీకరించారు. శుక్రవారం శస్త్రచికిత్స చేసి రెండు మూత్రపిండాలు, కాలేయం వేరు చేశారు. ఓ మూత్రపిండాన్ని విశాఖపట్నం అపోలో ఆసుపత్రికి, కాలేయాన్ని విశాఖలోని పినాకిల్ ఆసుపత్రికి వేర్వేరు వాహనాల్లో తరలించారు. రెండో మూత్రపిండాన్ని కాకినాడ అపోలోని మరో రోగికి అమర్చనున్నారు. అవయవాలను జీవన్‌దాన్‌లో భాగంగా విశాఖకు తరలించేందుకు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు పోలీసులు గ్రీన్‌ఛానల్ ఏర్పాటు చేశారు.


రెడ్డి కల్యాణ్ చక్రవర్తి (పాత చిత్రం)

ఆర్థిక సాయం

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్రవిశ్వవిద్యాలయం నృత్య విభాగంలో 14వ ర్యాంకు సాధించి ప్రవేశం పొందిన విద్యార్థినికి విశాఖకు చెందిన రాచకొండ ఛారిటీస్ నిర్వాహకులు రాచకొండ దశరదరామయ్య ఆర్థిక సహాయం అందించారు. పార్వతీపురంలోని జట్టు ఆశ్రమంలో ఉండి చదువుతూ ఉన్నత విద్యపై ఆసక్తితో ఏయూలో మంచి ర్యాంకు సాధించిన గిరిజన విద్యార్థిని లలితకు రెండు సంవత్సరాల చదువుకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందించడానికి దశరథరామయ్య ముందుకు వచ్చారు. ఈ మేరకు వసతి గృహానికి అవసరమైన డబ్బులను శుక్రవారం చెల్లించి ఆమెకు ప్రవేశం కల్పించారు.


వసతి గృహానికి నిధులు చెల్లిస్తున్న రాచకొండ దశరథరామయ్య, విద్యార్థిని లలిత



సదస్సులో మాట్లాడుతున్న ఆచార్య కె.ఎస్.చలం

జమిలి ఎన్నికలపై సదస్సు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: జమిలి ఎన్నికల అంశం మంచిదే అయినా భిన్న జాతులున్న దేశంలో అది ఎంతవరకు విజయవంతమవుతుందో చూడాలని ద్రవిడ విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య కె.ఎస్.చలం అన్నారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాలలో శుక్రవారం 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ (ఐఐపీఏ), ఏయూ రాజనీతి, ప్రభుత్వ పాలనా శాస్త్రం ఆధ్వర్యంలో శుక్రవారం 'ఒకే దేశం, ఒకే ఎన్నిక' అంశంపై ఒక రోజు సదస్సు నిర్వహించారు. ఆచార్య రొక్కం సుదర్శనరావు అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం అనంతరం ఆర్థికాభివృద్ధిపై ప్రభుత్వాలు దృష్టి సారించారే తప్ప విభిన్న జాతులను ఒకే జాతిగా తీర్చిదిద్దడంలో సఫలం చెందలేదన్నారు. ఆచార్య ప్రేమానందం మాట్లాడుతూ జమిలి ఎన్నికలను నిర్వహిస్తే సంక్షేమం, అభివృద్ధిపై పని చేయడానికి ప్రభుత్వాలకు ఆటంకాలు తొలగిపోతాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్ హరిబాబు, సత్యనారాయణ, వీర్రాజు, రత్నరాజు, నాగరాజు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విశాఖ ఉత్తరం

ద్విభాష్యంకు బాపిరాజు అవార్డు

సీతంపేట, న్యూస్‌టుడే : కిన్నెర ఆర్ట్ థియేటర్స్ హైదరాబాద్, సహృదయ సాహితి విశాఖపట్నం సంయుక్తంగా శుక్రవారం సాయంత్రం విశాఖ పౌరగ్రంథాలయంలో ప్రముఖ కథా రచయిత ద్విభాష్యం రాజేశ్వరరావుకు అడవి బాపిరాజు అవార్డు అందించారు. సభకు అధ్యక్షత వహించిన సహృదయ సాహితి అధ్యక్షులు శేఖర మంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ అడవి బాపిరాజు రచనలు వివరించారు. కిన్నెర ఆర్ట్ థియేటర్స్ సంస్థతో ఆయనకు గల సంబంధాన్ని విశదీకరించారు. రాజేశ్వరరావు రచనా ప్రతిభను వివరించారు. కిన్నెర ఆర్ట్ థియేటర్ కార్యదర్శి మద్దాళి రఘురాం మాట్లాడుతూ ద్విభాష్యం రాజేశ్వరరావుకు అడవి బాపిరాజు అవార్డు ఇవ్వడం సరియైనదేనన్నారు. అతిథుల సమక్షంలో ఆయనకు బాపిరాజు అవార్డు అందించారు. కార్యక్రమంలో ఓలేటి పార్వతీశం, డాక్టర్ కె.జి.వేణు, కొవ్వలి లక్ష్మీనారాయణ, కప్పిలి బీమేశ్వరరావు, మస్తాన్ రెడ్డి, డాక్టర్ కె.వి.ఎస్.మూర్తి, డాక్టర్ నిర్మలాదేవి, బి.రాధారాణి, పరమేశ్వరరావు, ఉప్పల అప్పల రాజు, ఆచార్య వెలమల సిమ్మన్న తదితరులు పాల్గొన్నారు.



ద్విభాష్యం రాజేశ్వరరావుకు అవార్డు అందిస్తున్న దృశ్యం

కాలి బాట ఖాళీ లేదాయే..

ప్రమాదాల బారిన పాదచారులు



సత్యంకూడలి మలుపులో కాలిబాటపై వ్యాపార సామగ్రి

గురుద్వారా, న్యూస్‌టుడే

వైకాపా పాలనలో జీవీఎంసీ పట్టణ ప్రణాళిక అధికారులు చూపించిన నిర్లక్ష్యం.. ప్రభుత్వం మారినా.... ఇప్పటికీ కొనసాగుతోంది. పాదచారుల సౌకర్యార్థం కోట్లు వెచ్చించి నిర్మించిన కాలిబాటలు ఆక్రమణలకు గురవుతున్నా పట్టించుకోవడం లేదు. వారి నిర్లక్ష్యం కారణంగా పాదచారులకు ప్రమాదాలు తప్పడం లేదు. సత్యంకూడలి నుంచి సీతమ్మధార అల్లూరి సీతారామరాజు కూడలికి వెళ్లే రహదారి ఇరువైపులా ఇదే పరిస్థితి నెలకొంది. గతంలో ఈ మార్గం ఇరుకుగా ఉండటంతో తీవ్ర ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడటమే గాక, పాదచారులు నడిచేందుకు వీలు లేక ప్రమాదాలు చోటుచేసుకునేవి. సమస్యను పరిష్కరించేందుకు అప్పట్లో జీవీఎంసీ స్పందించి విస్తరణ పనులు జరిపారు. అంత వరకూ బాగానే ఉన్నా... స్థానిక వ్యాపారస్తుల తీరుతో సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. పాదచారులు నడిచేందుకు వీలు లేకుండా దుకాణంలో ఉండాల్సిన కౌంటర్లు కాస్తా ఆ బాటను ఆక్రమించేస్తున్నాయి. ఎవరైనా ప్రశ్నిస్తే తమ దుకాణం ఎదుట ఉన్నది తమ స్థలమేనని దురుసుగా వ్యవహరిస్తున్నారు.



సత్యంకూడలి శివాలయం ఎదురుగా కాలిబాటపై పనులు చేస్తున్న దృశ్యం

ప్రధాన కూడలిలో వ్యాపారస్తులు బరితెగించి ఆక్రమిస్తున్నా.. అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడమేంటనే విమర్శలు వినిపిస్తున్నాయి. కనీసం అడుగు పెట్టడానికి కూడా వీలుకాని విధంగా వ్యాపారాలు సాగిస్తున్నారు. పలుమార్లు ట్రాఫిక్ పోలీసులు [illegible] దుకాణాలు తొలగించినా... మళ్లీ పరిస్థితి షరామామూలుగా తయారైంది. అధికారులు దృష్టిసారించి చర్యలు తీసుకుంటే కాలిబాట ప్రయాణాలు సాఫీగా సాగుతాయని ప్రజలు కోరుతున్నారు.



సీతమ్మధారకు వెళ్లే రహదారిలో దుకాణాలు ఇలా..

ఇసుక అందుబాటులో ఉంచాలి

కార్పొరేషన్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఇసుక లభ్యత ఉండకపోవడంతో కార్మికులు పస్తులుంటున్నారని, కూటమి అధికారంలోకి వస్తే ఇసుక ఉచితంగా ఇస్తామని ప్రకటించి, ఇసుకే దొరక్కుండా చేస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు అన్నారు. శుక్రవారం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు కార్మికులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇసుక కొరత తీవ్రంగా ఉందని, ప్రజలు కొనుగోలు చేయడానికి ఇసుక దొరకడం లేదన్నారు. దీంతో నిర్మాణాలు పెద్దఎత్తున నిలిచిపోయాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇసుకను అందుబాటులోకి తీసుకువచ్చి ఉచితంగా సరఫరా చేయాలన్నారు. ఆందోళనలో పార్టీ నగర కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు అప్పలరాజు, ఆదినారాయణ, నరసింగరావు, గోపాలకృష్ణ, మల్లేష్, రమణ, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు

పోర్టు హాస్పిటల్ పరిరక్షణకు దీక్షలు

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే: విశాఖ పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణను నిలిపివేయాలని కోరుతూ సాలగ్రామపురం పోర్టు హాస్పిటల్ వద్ద గత మూడు రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న కార్మికులకు సీఐటీయూ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.వి.కుమార్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోర్టు ఆసుపత్రిని ప్రయివేటీకరణ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం టెండర్లు పిలుస్తున్నందుకు నిరసనగా యునైటెడ్ పోర్ట్ అండ్ డాక్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలకు అన్ని సంఘాలు మద్దతు తెలపాలని కోరారు. విశాఖ అభివృద్ధికి పోర్టుట్రస్ట్ కారణమని, దీన్ని మనం కాపాడుకోవాలని కార్మికులు, విశాఖ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.సత్యనారాయణ, ఈశ్వరరావు, జె.సత్యనారాయణ, శ్రీను, బి.జగన్, వి.ఎన్.మూర్తి సూర్యనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.వి.కుమార్

దుర్గాదేవి మండపాల్లో నిబంధనలు పాటించాలి

గురుద్వారా, న్యూస్‌టుడే: దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలను ఏర్పాటుచేసే మండపాల్లో నిబంధనలు తప్పక పాటించాలని నార్త్‌జోన్ ఏసీపీ లక్ష్మణమూర్తి సూచించారు. శుక్రవారం బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని ఓ ఫంక్షన్‌లో మండపాల నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండపాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అగ్నిప్రమాదాలు జరగకుండా రక్షణ సామగ్రి అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఊరేగింపుల్లో రాత్రి సమయాల్లో బాణసంచా, డీజే సౌండ్లు పెడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ విజయకుమార్, ఎస్.ఐ వెంకట్రావ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నార్త్ ఏసీపీ లక్ష్మణమూర్తి, పక్కన సీఐ విజయకుమార్

జిల్లా అగ్నిమాపక ఉద్యోగుల సంఘం నూతన కమిటీ ఎన్నిక

మాధవధార, న్యూస్‌టుడే: జిల్లా అగ్నిమాపక ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి కె.వి.టి ప్రసాద్, పి.వి.సత్యనారాయణ, డి.ఎల్.నారాయణ, గణేష్, సమక్షంలో ఎన్నిక అధికారులుగా వ్యవహరించి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా జాబిమొగ్గల శ్రీను, ఉపాధ్యక్షుడిగా కె.దేవేష్‌బాబు, కార్యదర్శిగా ఎం.నాగేశ్వర ప్రసాద్, సహాయ కార్యదర్శిగా ఎస్.రామకృష్ణ, కోశాధికారిగా కడిలి ఎల్లాజీ, సలహాదారుగా ఎం.సురేష్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.చంద్రశేఖర్, పి.బాలకృష్ణ, పి.గోవింద్, పలువురు సంఘం సభ్యులు పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను ఘనంగా సత్కరించారు.



నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

అక్కినేని శత జయంత్యుత్సవాలకు ఏర్పాట్లు

డాబాగార్డెన్స్ (అల్లిపురం), న్యూస్‌టుడే: మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో ఈనెల 6న ఆదివారం సాయంత్రం నటుడు మురళీమోహన్‌కి అక్కినేని స్మారక పురస్కారం ప్రదానం చేయనున్నట్లు మాజీ మంత్రి దాడి వీరభద్రరావు పేర్కొన్నారు. కిన్నెర ఆర్ట్ థియేటర్, హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్కినేని శత జయంత్యుత్సవాల ముగింపు వేడుకల సందర్భంగా ఈ పురస్కారం అందజేయనున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా అక్కినేని నటించిన సినీ గీతాలతో ఆర్కెస్ట్రా ఉంటుందన్నారు. కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ప్రతినిధి రఘురాం మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని నగర ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. నిర్వాహక సంస్థ ప్రతినిధులు పార్వతీశం, రాజేంద్రప్రసాద్, ఎస్.వి.రామారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి దాడి వీరభద్రరావు

7న రెల్లి ఉపకులాల ఆధ్వర్యంలో ర్యాలీ

పూర్ణమార్కెట్ (అల్లిపురం), న్యూస్‌టుడే: రెల్లి, రెల్లి ఉపకులాలకు 5 శాతం రిజర్వేషన్ కేటాయించాలని విశాఖ జిల్లా రెల్లి సంఘం నాయకుడు మాజీ అటవీశాఖాధికారి ఎస్.కళ్యాణముని పేర్కొన్నారు. తాడివీధి కమ్యూనిటీహాలులో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి రెల్లి, రెల్లి ఉపకులాలకు 5శాతం రిజర్వేషన్ కేటాయించాలని కోరారు. ఈ మేరకు 7వతేదీన డాబాగార్డెన్స్ సర్కిల్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు ఇంటి గురుమూర్తి, ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, దశమంతుల వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న విశాఖ జిల్లా రెల్లి సామాజికవర్గ నాయకులు

ప్రమాదవశాత్తు బావిలో పడిన వ్యక్తి

మాధవధార, న్యూస్‌టుడే: మానసిక స్థితి సక్రమంగా లేకపోవడంతో ప్రమాదవశాత్తు ఇంట్లో ఉన్న బావిలో జారి పడిపోయిన వ్యక్తిని అగ్నిమాపక సిబ్బంది, పోలీసుల సహాయంతో బయటకు తీశారు. బావిలో నీరు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. వివరాలు ఇలా ఉన్నాయి. మాధవధారలో అరవై అడుగుల రహదారి సమీపంలో తన సొంత ఇంట్లో చిట్టినేని చైతన్య(43) తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నాడు. గత కొంత కాలంగా మానసిక స్థితి బాగోలేకపోవడంతో వైద్యం పొందుతున్నాడు. శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఉన్న బావి వద్దకు వెళ్లి, పైన ఉన్న చెక్కపై కూర్చున్నాడు. ఒక్కసారిగా చెక్క విరిగిపోవడంతో అమాంతంగా చైతన్య బావిలో పడిపోయాడు. వెంటనే తల్లి పార్వతి 100కి డయల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే వారు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా, బావిలోంచి బయటకు తీశారు. బావిలో ఎక్కువగా నీరు లేకపోవడంతో అతను పెద్ద ప్రమాదం నుంచి బయటపడ్డాడు. స్వల్ప గాయాలు కావడంతో వెంటనే 108కు సమాచారం అందించడంతో వారొచ్చి ప్రథమ చికిత్స అందించారు. చైతన్య తండ్రి బసవయ్య కూడా మానసిక వ్యాధితో బాధపడుతున్నట్లుగా కుటుంబ సభ్యులు తెలియజేశారు. పోలీసులు వివరాలను నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బాధితుడి వివరాలను తెలుసుకుంటున్న పోలీసులు

మద్యం దుకాణాల కేటాయింపులో పారదర్శకత పాటించాలి

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: మద్యం దుకాణాల కేటాయింపులో పారదర్శకత పాటించాలని ఉత్తరాంధ్ర యాత సంక్షేమ సాంస్కృతిక సేవా సంఘం తీర్మానించిందని సంఘం అధ్యక్షులు పిల్లి నూకరాజు తెలిపారు. శుక్రవారం నరసింహనగర్‌లోని ఆయన కార్యాలయంలో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. యాతలకు 10 శాతం దుకాణాలు కేటాయింపులో పారదర్శకత పాటించాలన్నారు. ఇంతవరకు ఎవరెవరికి ఏ దుకాణం కేటాయిస్తున్నారన్న విషయంపై స్పష్టత లేకుండా పోయిందన్నారు. దుకాణాలు పొందిన వ్యక్తులకు సంక్షేమ పథకాలు రద్దు కాకుండా చూడాలన్నారు. బినామీలకు అవకాశం ఇవ్వకూడదన్నారు. రిజర్వేషనున్న ఇచ్చినప్పుడు రాయితీపై కూడా స్పష్టత ఇవ్వాలని సంఘం తీర్మానించిందని తెలిపారు. గొడ్డి కన్నారావు, కొలుసు అచ్చిబాబు, సంపంగి మంగరాజు, దమ్ము రమణ, ఒనుం దేవుడు, నెల్లి దేముడు, నెల్లి సోమేష్, నకరబోయిన అప్పలనాయుడు, సిమ్మా గోవిందు, పాలికల చలం, రెడ్డి అశోక్‌కుమార్, కొలుసు సత్యారావు, పిల్లి నూకరాజు (కంచరపాలెం), రంగాల రాజు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు

అమ్మవార్లకు అద్భుత అలంకరణలు



మాధవధార : సీతన్నగార్డెన్స్‌లో గాయత్రి దేవి అలంకరణలో అమ్మవారు



మాధవధార : కళింగనగర్‌లో లక్ష్మీనరసింహ ఆటో స్టాండ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి



కార్పొరేషన్ : రెండవ పట్టణ పోలీసు స్టేషన్ సమీపంలోని ఉమాదేవి ఆలయంలో గాయత్రి దేవి అలంకరణలో ఉమాదేవి



కార్పొరేషన్ : పాతనగరంలో లలితాదేవి అలంకరణలో కన్యకాపరమేశ్వరి అమ్మవారు



కంచరపాలెం : రెడ్డికంచరపాలెం సన్‌రైజ్‌క్లబ్ వద్ద గాయత్రి దేవిగా శ్రీదుర్గమాంబ అమ్మవారు



మురళీనగర్ : సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు




తాటిచెట్లపాలెం : మధుసూదన్‌నగర్‌లో శ్రీకనక దుర్గాదేవి అమ్మవారి ఉత్సవాల్లో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

అనుమతుల మేరకే ఉత్సవాలు

మాధవధార, న్యూస్‌టుడే: నిబంధనలు పాటించి, అనుమతులు తీసుకొని దుర్గాదేవి మండపాలను ఏర్పాటు చేయాలని ఎయిర్‌పోర్టు సీఐ వి.చక్రధర్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం పోలీస్‌స్టేషన్ పరిధిలో దుర్గాదేవి కమిటీ సభ్యులతో ఆయన సమావేశం నిర్వహించారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా మండపాలను ఏర్పాటు చేయాలని, కచ్చితంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు




దుర్గాదేవి కమిటీ సభ్యులకు సూచనలిస్తున్న ఎయిర్‌పోర్టు సీఐ వి.చక్రధర్‌రావు



మురళీనగర్ : శ్రీ సీతారామాలయ సముదాయంలో లలితా దేవి అలంకారంలో అమ్మవారు



అక్కయ్యపాలెం : ఎన్‌జీజీఓఎస్ కాలనీలో సర్వమత సంప్రదాయంగా ఏర్పాటు చేసిన దుర్గాదేవి ప్రతిమ



గురుద్వారా : సీతమ్మధార నార్త్‌ఎక్స్‌టెన్షన్ దరి సాయిబాబా మందిరంలో వీరాంజనేయస్వామి అవతారంలో శ్రీవారు



గురుద్వారా : సీతమ్మధార నార్త్‌ఎక్స్‌టెన్షన్ దరి సాయిబాబా మందిరంలో కన్యకాపరమేశ్వరిగా అమ్మవారు



తాటిచెట్లపాలెం : మధుసూదన్‌నగర్‌లో ప్రతిష్ఠించిన శ్రీదుర్గాదేవి అమ్మవారు



సీతంపేట : సీతంపేటలోని శ్రీ పార్వతీశ్వర ఆలయంలో గాయత్రిదేవి అలంకరణలో అమ్మవారు

వార్డుల్లోని సమస్యల పరిష్కారానికి కృషి

వన్‌టౌన్, న్యూస్‌టుడే: జీవీఎంసీ 29వ వార్డులో జోన్-4 జెడ్సీ మల్లయ్యానాయుడు శుక్రవారం పర్యటించారు. వార్డు కార్పొరేటరు ఉరికూటి నారాయణరావు, ఇతర అధికారులతో కలిసి వార్డు పరిధిలోని పెంటవీధి, స్కీమ్‌బిల్డింగ్, రామజోగిపేట, అంగడిదిబ్బ, జెడ్పీ కూడలి, ఊటగెడ్డ తదితర ప్రాంతాల్లో పర్యటించి స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిశీలించారు. డ్రైనేజీ, యూజీడీ పనులు, తాగునీటి సమస్యలపై దృష్టి సారిస్తామని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. సామాజిక భవనాల పనులకు శంకుస్థాపనలు త్వరలో చేస్తామని జెడ్సీ తెలిపారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్, సచివాలయ ఉద్యోగులు, పర్యవేక్షకులు పాల్గొన్నారు.



పెంటవీధిలోని మ్యాన్‌హోల్‌ను పరిశీలిస్తున్న జెడ్సీ మల్లయ్యనాయుడు, కార్పొరేటరు నారాయణరావు తదితరులు

15 కిలోల గంజాయి స్వాధీనం

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: విశాఖ మీదుగా గంజాయిని అక్రమంగా రవాణా చేసేందుకు యత్నించిన వారిని విశాఖలో రైల్వే పోలీసులు అరెస్టు చేసినట్లు జీఆర్పీ సీఐ ధనుంజయనాయుడు తెలిపారు. ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లాకు చెందిన గోపాల్ పంగి, మధ్యప్రదేశ్‌కు చెందిన ఆశాదు దాస్ విశాఖ మీదుగా వెళ్లేందుకు విశాఖ స్టేషన్‌లో రైలు కోసం ఎదురు చూస్తుండగా.. గస్తీలో ఉన్న ఆర్పీఎఫ్ బృందానికి వారు చిక్కినట్లు తెలిపారు. వారి బ్యాగులలో 15 కిలోల గంజాయి పొట్లాలు ఉన్నట్లు గుర్తించి కేసు నమోదు చేశామని, సరకు సీజ్ చేసి నిందితుల్ని న్యాయస్థానంలో హజరుపర్చాక రిమాండ్‌కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.



రైల్వే పోలీసుల అదుపులో నిందితులు

బాక్సింగ్ పోటీల్లో విద్యార్థి ప్రతిభ

అల్లిపురం, న్యూస్‌టుడే: నీలం వేపచెట్టు శ్రీకాశ్యప్ విద్యానికేతన్‌లో 8వ తరగతి విద్యార్థి అన్వేష్ జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ కె.శ్రీనివాస్ తెలిపారు. ఇటీవల నగరంలో జరిగిన రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో కాంస్య పతకం సాధించి దిల్లీలో జరగనున్న జాతీయ పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో అన్వేష్‌ను అభినందించారు.

కలెక్టర్‌ను కలిసిన డీఆర్‌డీఏ పీడీ

వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఏ) పథక సంచాలకులుగా బాధ్యతలు చేపట్టిన లక్ష్మీకాంత్ శుక్రవారం కలెక్టర్ హరేంధిరప్రసాద్‌ను శుక్రవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలను పక్కాగా అమలు చేయాలని, ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పథకాన్ని పక్కాగా అమలు చేయాలని పీడీకి కలెక్టర్ సూచించారు. ఈయన గతంలో భీమునిపట్నం డీఎల్‌డీఓగా పనిచేస్తూ డీఆర్‌డీఏ పీడీగా బదిలీపై వచ్చారు.



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీకాంత్

విశాఖ సీసీఎఫ్‌గా మహ్మద్ దివాన్ మైదీన్

న్యూస్‌టుడే, పెదవాల్తేరు: విశాఖపట్నం జిల్లా అటవీశాఖ ముఖ్య అటవీ సంరక్షణాధికారి (సీసీఎఫ్)గా మహ్మద్ దివాన్ మైదీన్‌ను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో పనిచేసిన శ్రీకంఠనాథరెడ్డిని సాధారణ పరిపాలనశాఖకు రిపోర్టు చేయాలని ఆదేశించింది. అలాగే ఇందిరాగాంధీ జంతుప్రదర్శనశాల క్యూరేటర్ నందినీ సలారియాను ఇక్కడి నుంచి ఏపీ ఎంఎస్ఎంఈ విభాగానికి సీఈవోగా బదిలీ చేశారు. ఆమె స్థానంలో కొత్తవారిని నియమించాల్సి ఉంది. అలాగే అనకాపల్లి జిల్లా డీఎఫ్‌ఓ జగన్నాథసింగ్, రంపచోడవరం డీఎఫ్‌వో నరేంద్రన్‌లను బదిలీ చేసింది. పాడేరు డీఎఫ్‌వోగా వెంకట సందీప్ రెడ్డి, రంపచోడవరం డీఎఫ్‌వోగా రవీంద్ర ధర్మాలను ప్రభుత్వం నియమించింది.

ద్రోణంరాజు శ్రీనివాస్‌కు ఘన నివాళి

వన్‌టౌన్, న్యూస్‌టుడే: మాజీ ఎమ్మెల్యే, దివంగత ద్రోణంరాజు శ్రీనివాస్ నాలుగో వర్ధంతిని పాతనగరంలోని స్వామి వివేకానంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. వైకాపా జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్‌కుమార్, తైనాల విజయకుమార్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, సంస్థ గౌరవాధ్యక్షులు డాక్టర్ జహీర్‌అహ్మద్, సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, ద్రోణంరాజు శ్రీవత్సవ తదితరులు ద్రోణంరాజు శ్రీనివాస్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళి అర్పించారు. ఎమ్మెల్యేగా, వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ఆయన అందించిన సేవలను కొనియాడారు.



మాజీ ఎమ్మెల్యే, దివంగత ద్రోణంరాజు శ్రీనివాస్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

పోర్టులో ముగిసిన హిందీ పక్షోత్సవాలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: మేజర్ పోర్టుల్లో అధికార భాషా ప్రయోగాన్ని ప్రోత్సహించడం, పర్యవేక్షించడం కోసం కేంద్ర నౌకాయాన, పోర్టులు, జలవనరుల మంత్రిత్వ శాఖ సూచనల మేరకు విశాఖ పోర్టు అథారిటీ(వీపీఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన హిందీ పక్షోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. వీపీఏ పరిపాలన భవనంలోని సాంబమూర్తి ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో వీపీఏ ఉప ఛైర్మన్ దుర్గేశ్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అధికార భాష వినియోగంలో దేశంలోని ప్రధాన పోర్టుల్లో వీపీఏ మూడోస్థానంలో నిలిచిందన్నారు. అనంతరం పోర్టు అధికారులు, సిబ్బందికి హిందీలో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ముఖ్య విజిలెన్స్ అధికారి పీఎస్ఎల్ స్వామి, కార్యదర్శి టి.వేణుగోపాల్, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.



విజేతలకు అవార్డులను అందజేస్తున్న వీపీఏ ఉప ఛైర్మన్ దుర్గేశ్‌కుమార్, నిర్వాహకులు

వ్యక్తి బలవన్మరణం

గురుద్వారా, న్యూస్‌టుడే: మద్యానికి బానిసై ఓ వ్యక్తి నరసింహనగర్ పోర్టు క్వార్టర్స్‌లో బలవన్మరణానికి పాల్పడిన ఘటన నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో చోటుచేసుకుంది. సీఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం సింహగిరి కాలనీకి చెందిన సబ్బవరపు గణేశ్(60) పరుపులు కుట్టే వృత్తి చేస్తుంటాడు. పూటుగా మద్యం సేవించి ఇంటి ముందు నిద్రిస్తుంటాడు. గురువారం రాత్రి సుమారు 8 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఇది వరకు ఉన్న నర్సింహనగర్ పోర్టు క్వార్టర్స్‌లో కిటికీకి ఉరి వేసుకుని ఉండటాన్ని అక్కడ ఉండే పనివాళ్లు చూసి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ విజయ్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. బలవన్మరణం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గాజువాక

• గాజువాక • విశాఖ పశ్చిమం

నూతన నిర్మాణాలకు శంకుస్థాపన



పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ వెంకటరమేశ్

గోపాలపట్నం(కొత్తపాలెం), న్యూస్‌టుడే : జీవీఎంసీ 89వ వార్డులో దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ దాడి వెంకటరమేశ్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఖారవేలనగర్‌లో రూ.19.55లక్షల జీవీఎంసీ నిధులు చేపట్టే సీసీరోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం అధ్వానంగా ఉన్న కాలువలను పరిశీలించి, మరమ్మతులు చేయిస్తామన్నారు. వార్డు తెదేపా అధ్యక్షుడు బొడ్డేటి విజయ్‌కుమార్, ప్రజా పనుల విభాగం ఏఈ వెంకటలక్ష్మి, రామకృష్ణ, కాలనీ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం



పల్లాకు చెక్ అందజేస్తున్న సంఘం ప్రతినిధులు

గాజువాక, న్యూస్‌టుడే : విజయవాడ వరద బాధితులకు విశాఖ సొండి కుల సంక్షేమ సంఘం ప్రతినిధులు రూ.1.08 లక్షలు అందజేసి ఉదారతను చాటుకున్నారు. సీఎం సహాయ నిధి పేరిట తీసిన చెక్కును శుక్రవారం గాజువాకలో తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు అందజేశారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రవిచంద్ర, దేవరాజ్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

గాజువాక: 98494 65088

పశ్చిమం (గోపాలపట్నం): 95428 96869

–న్యూస్‌టుడే, గోపాలపట్నం

సమస్య : జీవీఎంసీ 89వ వార్డు ఆదర్శనగర్ రైల్వేగేటు నుంచి కొత్తపాలెం కూడలికి వెళ్లే ప్రధాన రహదారి ఇటీవల వర్షాలకు ధ్వంసమై.. గోతులు ఏర్పడ్డాయి. రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

– కాశీనాథం, చంద్రనగర్

సమాధానం : రోడ్డు నిర్మాణానికి రూ.20 లక్షల నిధులు మంజూరయ్యాయి. త్వరలోనే పనులు ప్రారంభిస్తాం.

– డి.వి.రమేశ్, వార్డు కార్పొరేటర్

సమస్య : బాజీకూడలి నుంచి పాతగోపాలపట్నం వెళ్లే రోడ్డులో వీధి దీపాలు వెలగడం లేదు.– సన్యాసిరావు, పాతగోపాలపట్నం.

సమాధానం : పరిశీలించి.. అవసరమైన చోట కొత్త దీపాలు అమర్చుతాం.

– గోవిందరావు, వీధి దీపాల నిర్వాహకుడు

పూడిక తొలగే.. మురుగు కదిలే..

స్పందనకు వందనం

గాజువాక శివారు కాలనీల మురుగు కాలువల్లో ఎక్కడికక్కడ వ్యర్థాలు పేరుకుపోయి... నీరంతా స్తంభిస్తున్న సమస్యపై 'ఈనాడు'లో పలుమార్లు వార్తలు ప్రచురితమయ్యాయి. స్పందించిన జీవీఎంసీ జోన్-6 ప్రజా ఆరోగ్య సిబ్బంది శుక్రవారం పనులు చేపట్టారు. దుర్గవానిపాలెం, సత్యనారాయణపురం, కూర్మన్నపాలెం పరిసరాల్లో గ్యాంగ్ వర్క్ పేరిట పూడిక తొలగించి, మురుగు ముందుకెళ్లేలా చర్యలు చేపట్టారు. ఆయా కాలనీల్లో ఎప్పుడో మున్సిపాలిటీ హయాంలో నిర్మించిన కాలువలు అధ్వానంగా తయారవడంతో తరచూ సమస్య తలెత్తుతోందని, శాశ్వత పద్ధతిలో పరిష్కారం చూపాలని నివాసితులు కోరుతున్నారు.



–న్యూస్‌టుడే, పెదగంట్యాడ

నిబంధనల అమలేది..?

పారిశ్రామిక ప్రాంతంలో శ్రీహరిపురంలో శుక్రవారం అధిక శబ్దంతో 'డీజే'లు వినియోగిస్తూ ప్రైవేటు వ్యక్తులు ఊరేగింపు నిర్వహించడంతో ప్రజలకు అనేక ఇబ్బందులు ఎదురయ్యాయి. ఊరేగింపు వాహనాలు నెమ్మదిగా సాగడంతో సేవా రహదారిలో ట్రాఫిక్ స్తంభించింది. రద్దీ మార్గాల్లో నిబంధనలకు విరుద్ధంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపించారు.



–న్యూస్‌టుడే, సింధియా (జవహర్‌నగర్)

అభివృద్ధి పనులపై ఆరా

కరాస, న్యూస్‌టుడే : మద్రిపాలెం వుడాలేఅవుట్ హరితవనంలో చేపడుతున్న అభివృద్ధి పనులను శుక్రవారం కమిషనర్ సంపత్‌కుమార్ పరిశీలించారు. మహిళా వాకింగ్ ట్రాక్, ఉద్యానవనం నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం కరాస శ్మశానవాటిక, రజకకాలనీ కళావేదిక, శాంతినగర్, పాత కరాసలో జరుగుతున్న పనులపై ఆరా తీశారు. ఆయన వెంట ఉపమేయర్ జియ్యాని శ్రీధర్, జీవీఎంసీ ఏఈ ఉషారాణి, ఉద్యానవన శాఖ ఏఈ అర్చన, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

మల్కాపురం, న్యూస్‌టుడే : జీవీఎంసీ 63వ వార్డులో వివిధ అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కార్పొరేటర్ గల్లా చిన్నా కోరారు. శుక్రవారం ఆయన జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. కొండవాలు ప్రాంతాల్లో రక్షణ గోడలు, కాలువలు, రహదారులు, మెట్లు నిర్మించాలని కోరారు. అంగన్‌వాడీ, సామాజిక భవనాలకు మరమ్మతులు చేపట్టాలని విన్నవించారు.



కరాస పార్కులో పర్యటిస్తున్న కమిషనర్ సంపత్‌కుమార్, ఉపమేయర్ శ్రీధర్, తదితరులు

సంక్షిప్త సమాచారం..

● కార్మికురాలి తొలగింపుపై నోటీసులు జారీ

అగనంపూడి, న్యూస్‌టుడే : పెదగంట్యాడ హార్టీకల్చర్ సొసైటీలో మహిళా కార్మికురాలి తొలగింపుపై కేంద్ర కార్మిక వివాదాల పరిష్కార ట్రైబ్యునల్ కోర్టు స్పందించి.. ఉక్కు సీఎండీతో పాటు సొసైటీ పాలకులకు నోటీసులు జారీ చేసిందని స.హ.చట్టం కార్యకర్త పట్టా రామఅప్పారావు తెలిపారు. శుక్రవారం అగనంపూడిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉక్కు నిర్వాసిత కుటుంబానికి చెందిన దేవర అప్పల కొండమ్మకు వయోపరిమితిని సాకుగా చూపి, సొసైటీ విధుల నుంచి అన్యాయంగా తొలగించారన్నారు. బాధితురాలికి పూర్తిస్థాయి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు.

● ఆశ్రమ చిన్నారులకు చేయూత

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : పెదగంట్యాడ సమీప నడుపూరులో కేటీబీ మండల కమిటీ అధ్యక్షుడు తాటికొండ కాశీవిశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం జనరేషన్ యువ అనాథ ఆశ్రమంలో చిన్నారులకు నిత్యావసరాలు, విద్యాసామగ్రి పంపిణీ చేశారు. 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, ప్రతినిధులు అచ్చిలినాయుడు, సుదర్శన్, అప్పలరాజు, వెంకటరమణ పాల్గొన్నారు.

● చురుగ్గా సభ్యత్వ నమోదు

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : ఈనెల 15 వరకు రెండో విడత సభ్యత్వ నమోదు కార్యక్రమం కొనసాగుతుందని భాజపా గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు అన్నారు. శుక్రవారం గంగవరం ఆటోస్టాండ్ వద్ద రాష్ట్ర మత్స్యకార సెల్ ప్రతినిధి గరికిన పైడిరాజు ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. రాజన్న, రాజశేఖర్, మాధవి, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

● రైలు ప్రయాణికులకు జరిమానా

ఉక్కునగరం(కూర్మన్నపాలెం), న్యూస్‌టుడే : కడప- తిరుపతి నుంచి విశాఖ వస్తున్న తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలులో శుక్రవారం ఉదయం దువ్వాడ ఆర్పీఎఫ్ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. మహిళలు, దివ్యాంగులకు కేటాయించిన బోగీల్లో ప్రయాణిస్తున్న 30 మంది పురుషులను స్టేషన్‌లో దింపి.. జరిమానా విధించారు. నిబంధనలకు విరుద్ధంగా బోగీల్లోకి ఎక్కితే చర్యలు తప్పవని రైల్వే పోలీసులు హెచ్చరించారు.

గాయత్రీ మాతా.. నమోస్తుతే..!



సాగరగిరికొండపై..



కైలాసనగర్‌లో..



వాంబేకాలనీలో..



కణితిరోడ్డులో..



డ్రైవర్స్‌కాలనీలో..



పాత గాజువాకలో ..



అగనంపూడిలో..



తుంగ్లాంలో..



ఎల్వీనగర్‌లో

భక్తిశ్రద్ధలతో దసరా ఉత్సవాలు

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం గాజువాక, విశాఖ పశ్చిమం పరిధిలోని వివిధ ఆలయాలు, మండపాల్లో అమ్మవారు గాయత్రీ దేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు సామూహిక కుంకుమార్చనలు చేశారు. వివిధ పార్టీల నాయకులు అమ్మవారి విగ్రహాలను దర్శించుకుని పూజలు చేశారు. కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

–న్యూస్‌టుడే, గాజువాక, విశాఖ పశ్చిమం బృందం



గాజువాక డిపో వద్ద



యాదవజగ్గరాజుపేటలో..



కాపు తుంగ్లాంలో..



అక్కిరెడ్డిపాలెంలో..



ఉక్కునగరంలో..

ఆకట్టుకున్న బొమ్మల కొలువు

గాజువాక, న్యూస్‌టుడే : దసరా ఉత్సవాల్లో భాగంగా గాజువాక సమీప శ్రీనగర్ యాపిల్-ఐ పాఠశాల ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు ఆకట్టుకుంది. విద్యార్థులు, ఉపాధ్యాయులు సందడి చేశారు. పాఠశాల ఛైర్మన్ టి.బలరామకృష్ణ, ప్రిన్సిపల్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

జిల్లా కార్యవర్గ సమావేశం

గోపాలపట్నం, న్యూస్‌టుడే : గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సీహెచ్.వరప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందోలు వెంకటేశ్వర్లు, సభ్యులు ఎం.శ్రీనివాసరావు, సుధాకరరావు, చిన్నారావు, మహదేవ్, జోసెఫ్, అమృతరావు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యం

విజయవాడ, న్యూస్‌టుడే: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి సంస్థ (ఎం.ఎస్.ఎం.ఇ.డి.సి.) ఛైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విజయవాడ ముత్యాలంపాడులోని ఎం.ఎస్.ఎం.ఇ. కార్యాలయంలో ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఎం.ఎస్.ఎం.ఇ. ద్వారా యువతను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేలా ప్రణాళిక సిద్ధం చేస్తామన్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న శివశంకర్

సింధియా, న్యూస్‌టుడే : పారిశ్రామిక ప్రాంతానికి చెందిన జనసేన పార్టీ పశ్చిమ నియోజవర్గం సమన్వయకర్త **అంగ దుర్గాప్రశాంతి** శుక్రవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ఏపీ అర్బన్ ఫైనాన్స్, మౌలిక వసతుల అభివృద్ధి (ఏపీయూఎఫ్ఐడీసీ) సంస్థ డైరెక్టర్‌గా ప్రమాణ స్వీకారం చేశారు.



అక్కిరెడ్డిపాలెం(బీహెచ్‌పీవీ), న్యూస్‌టుడే : మింది గ్రామానికి చెందిన రైల్వే ఉద్యోగి **మంగా రవికాంత్** అర్బన్ బ్యాంక్ సౌత్ ఈస్టర్న్, ఈస్ట్ కోస్ట్ రైల్వే ఉద్యోగుల కో-ఆపరేటివ్ సొసైటీ వైస్ ఛైర్మన్‌గా నియమితులయ్యారు. శుక్రవారం ఛైర్మన్ ఎస్పీ సింగ్ చేతుల మీదుగా బాధ్యతలు స్వీకరించారు.



గాజువాక, న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) నూతన ఛైర్మన్‌గా నియమితులైన రవినాయుడును శుక్రవారం అమరావతిలో విశాఖ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి మొల్లి పెంటిరాజు తదితరులు కలిసి అభినందించారు.

నూతన నియామకం

న్యూస్‌టుడే, పెదవాల్తేరు: విశాఖపట్నం జిల్లా అటవీశాఖ ముఖ్య అటవీ సంరక్షణాధికారి (సీసీఎఫ్)గా మహ్మద్ దివాన్ మైదీన్‌ను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో పనిచేసిన శ్రీకంఠనాథరెడ్డిని సాధారణ పరిపాలనశాఖకు రిపోర్టు చేయాలని ఆదేశించింది. అలాగే ఇందిరాగాంధీ జంతు ప్రదర్శన శాల క్యూరేటర్ నందినీ సలారియాను ఇక్కడి నుంచి ఏపీ ఎంఎస్ఎంఈ విభాగానికి సీఈవోగా బదిలీ చేశారు. ఆమె స్థానంలో కొత్తవారిని నియమించాల్సి ఉంది.

'మానవహారానికి హాజరవ్వండి'

ఉక్కునగరం(స్టీల్‌సెక్టారు-3), న్యూస్‌టుడే : విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 6న గాజువాక నుంచి అగనంపూడి వరకు నిర్వహించే మానవహారాన్ని విజయవంతం చేయాలని ఉక్కు సిటూ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి పిలుపునిచ్చారు. శుక్రవారం కర్మాగారంలో నిర్వహించిన కార్మిక సమావేశంలో ఆయన మాట్లాడారు. శాశ్వత, ఒప్పంద కార్మికుల కుటుంబాలు, నిర్వాసితుల కుటుంబాలు, ప్రజా సంఘాలు పాల్గొనాలని కోరారు.

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: మానవహారానికి స్టీల్‌ప్లాంట్ నిర్వాసిత సంఘం సంఘీభావం తెలిపింది. శుక్రవారం నెల్లిముక్కు తెదేపా కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో సంఘం నాయకులు గొందేశి సత్యారావు, పులి వెంకటరమణారెడ్డి, యెల్లేటి శ్రీనివాస్, మసేనురావు, అప్పారావు, పరదేశి పాల్గొన్నారు.

'నిలిచిపోయిన పనులు ప్రారంభించాలి'

ఉక్కునగరం(స్టీల్‌సెక్టారు-3), న్యూస్‌టుడే : ఉక్కు కర్మాగారంలో నిలిచిపోయిన పనులకు వెంటనే టెండర్లు పిలిచి, పనులు ప్రారంభించాలని ఉక్కు అఖిలపక్ష ఒప్పంద కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు కోరారు. శుక్రవారం ప్రధాన పరిపాలన భవనం కూడలిలో ధర్నా నిర్వహించారు. కొన్ని పనులకు టెండర్లు ఖరారు కాకపోవడంతో సుమారు 500 మంది కార్మికులు ఉపాధి కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు జి.శ్రీనివాస్, ఎన్.రమణ, వంశీ, రాజేష్, రమణ పాల్గొన్నారు.

హామీల అమలుకు పెద్దపీట

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల అమలుకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని గాజువాక తెదేపా సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం గాజువాక తెదేపా కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో చెత్త పన్ను రద్దు ద్వారా రూ.కోట్ల ఆదాయం నష్టపోతున్నా... ప్రజా ప్రయోజనాలే ముఖ్యంగా ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారన్నారు. పార్టీ బీసీసెల్ అధ్యక్షుడు తమిరె శివప్రసాద్, నాయకులు వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తెదేపా సమన్వయకర్త శ్రీనివాస్

పరారైన నిందితుడి అరెస్టు

ఉక్కునగరం (కూర్మన్నపాలెం), న్యూస్‌టుడే : గంజాయి నిందితుడిని శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఆ వివరాలు. . గత నెల 29న గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పట్టుకునేందుకు దువ్వాడ పోలీసులు రైల్వే స్టేషన్ ప్రాంతంలో నిఘా ఉంచారు. ఆ రోజు ఓ నిందితుడు పోలీసుల చేతికి చిక్కగా, మరొకరు పరారయ్యారు. పరారైన వ్యక్తిని ఇప్పుడు అదుపులోకి తీసుకున్నామని దువ్వాడ సీఐ కె.మల్లేశ్వరరావు తెలిపారు.